


సీఎం చంద్రబాబు సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



పొన్నెకల్లుకు 14న సీఎం చంద్రబాబు

- అంబేడ్కర్ జయంతి వేడుకలకు ఏర్పాట్లు
- అధికారులు కలిసి కట్టుగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశాలు

తాడికొండ(పొన్నెకల్లు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ జయంతి వేడుకలకు తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామం వేదికగా ఎంపిక చేశారు. ఈ జయంతి వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గురువారం ఇన్‌చార్జి కలెక్టర్ ఏ.భార్గవతేజ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో సమావేశాన్ని నిర్వహించి అధికారు లకు బాధ్యతలు అప్పగించారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పొన్నెకల్లులో రాష్ట్ర స్థాయిలో జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని అధికారులం దరు సమన్వయంతో విజయంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో పేదరికం లేకుండా రూపు మాపేందుకు ముఖ్యమంత్రి చేపట్టిన పీ-4 మార్గదర్శి - బంగారు కుటుంబం కాన్సెప్ట్‌తో కార్యక్రమం జరగనున్నదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మురళీకృష్ణ, సీపీవో శేషశ్రీ, డీఆర్‌డీఏ డ్వామా పీడీ విజయలక్ష్మి, శంకర్, డీపీవో నాగసాయి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి, పౌర సరఫరాల అధికారి కోమలి పద్మ,తాహసీల్దార్లు వెంకటేశ్వర్లు, మెహర్‌కుమార్, టీడీపీ మం డల పార్టీ అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, అధికార ప్రతి నిధి గుంటుపల్లి మధుసూదనరావు, ఎడ్లూరి హను మంతరావు, కొమ్మినేని రామచంద్రరావు, పంచా యతీ కార్యదర్శి షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో.. దుష్పరిణామాలు

- వినియోగ రహితంగా జిల్లాను తీర్చిదిద్దాలి
- ఎన్‌సీవోఆర్డీ సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిసలయ్యే యువత వ్యక్తిగతంగా నష్టపోవడంతో పాటు సమాజంలోనూ దుష్పరిణామాలకు కారకులవుతారని ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ(ఎన్‌సీవోఆర్డీ) జిల్లా స్థాయి



సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాను మాదక ద్రవ్యాల వినియోగరహితంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పాఠశాలలో, కళాశాలల్లో నిరంతరం అవగాహన పర్యవేక్షణ కోసం ఈగల్ క్లబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. మత్తుపదార్థాలతో అనర్థాలపై నిషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో యువతకు అవగాహన కలిగేలా వివిధ రకాల పోటీలు, కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడినవారి కోసం జీజీహెచ్‌లో డీ ఎడిక్షన్ సెంటరు ఏర్పాటుతో పాటు, నిర్ధారించే ర్యాపిడ్ కిట్లు సమకూర్చుకోవాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలతో నెలకొనే అనర్థాలపై పోలీస్‌శాఖ రూపొందించిన ఈగల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఎస్పీ సతీష్‌కుమర్, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా, డీఆర్వో ఖాజావలి, ఏఎస్పీ జీవీ రమణమూర్తి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణకుమారి, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, డీఈవో రేణుక, ఆర్డీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాలను నివారించాలి

జిల్లాలో రహదారి ప్రమాదాలను నివారించేందుకు పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ ఆదేశించారు. జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలకు అవకాశం ఉన్న 19 ప్రాంతాల్లో బ్లాక్‌స్పాట్లలో అవసరమైన పనులు వెంటనే చేపట్టాలన్నారు. సమావేశంలో డీటీసీ సీతారామిరెడ్డి, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, ఆర్టీసీ ఆర్ఎం కృష్ణకాంత్, నగరపాలక సంస్థ ఎస్ఈ శివనాగమల్లేశ్వరరావు, సీపీ రాంబాబు, ఎన్టీఆర్ వైద్య సేవ కో ఆర్డినేటర్ డా. విజయప్రకాష్, ఆర్టీవోలు సత్యన్నారాయణ ప్రసాద్, శ్రీహరి, సుదీక్షణ ఫౌండేషన్ ప్రతినిధి రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

చెయ్యి మార్చగా రూ.6.8 కోట్లు మిగులు







గోలీల డొంక రోడ్డులో కొత్తపాలెం సమీపంలో కొన్న భూముల్లో మాత్రం వైసీపీ ముఖ్య నేతకు దగ్గరి అనుచరుడు, ఆర్థిక లావాదేవీలన్నీ దగ్గరుండి చూసుకున్న వ్యక్తి భూములు చేతులు మార్చి రోజుల వ్యధిలోనే రూ.6.8 కోట్లు వెనకేశారనేది ఆరోపణ. ఈయన తన బంధువుల పేరుపై 13 ఎకరాలను రూ.40 లక్షలు చొప్పున కొనుగోలు చేశాడు. ఆ తర్వాత వారానికే ఆ భూములను ప్రభుత్వానికి అమ్మేసి రూ.6.8 కోట్లు జేబులో వేసుకున్నాడని సమాచారం.

కుంభకోణంపై.. కనికరమా?

- విజిలెన్స్ విచారణపై అనుమానాలు
- జగనన్న కాలనీల పేరిట భూ కొనుగోల్‌మాల్
- తెనాలిలోనే రూ.100 కోట్లు చేతులు మారినట్లు ఆరోపణలు
- నాడు వైసీపీ నేతలకు మేలు చేసిన కొందరు అధికారులు
- వారిని కాపాడేందుకే విచారణలో తాత్సారమన్న ఆరోపణలు

నాడు పేదలకు సొంతిల్లని జగనన్న కాలనీల పేరిట భూ కుంభకోణానికి పాల్ప డిన వైసీపీ పెద్దల గుట్టురట్టు చేయాల్సిన అధికారులు కనికరం చూపుతున్నారు. ఒక్క తెనాలిలోనే రూ.100 కోట్లు కొట్టేసిన భూ కుంభ కోణం అంతుతేల్చేందుకు కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశిం చింది. అయితే ఈ విచారణ జరుగుతున్న తీరు చూస్తే నాడు భూమాయలో భాగ స్వాములను కాపాడేటట్లుగా ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్విడ్‌ప్రోకో పద్ధతిలో అప్పటి ప్రభుత్వంలోని పెద్దలు భారీగానే ప్రజా ధనాన్ని దోచేశారని నాడు విమర్శలు వెల్లువెత్తాయి. అయితే నాటి ప్రభుత్వంలో అటు పాలకులు, ఇటు అధికా రులు దీని గురించి పట్టించుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా దోపిడీ జరిగినా, భారీ మొత్తం చేతులు మారింది మాత్రం తెనాలిలోనే అని కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. తెనాలిలో జరిగిన ఈ భూమాయ గుట్టును విజిలెన్స్ అధికారులు బహిర్గతం చేస్తే రాష్ట్రంలో మిగిలిన నియోజకవర్గాల్లో జరిగిన కుంభకోణాల్ని బట్టబయలు చేసేందుకు ఒక ఉదాహరణగా మారనుంది. అయితే ఇంతటి ప్రాధాన్యం ఉన్న కుంభకోణంపై విచారణ నెల నుంచి కొనసా...గుతూనే ఉంది. అధికారులు సంబంధిత రైతులను అడుగుతున్న ప్రశ్నలు, వారు చెబుతున్న సమాధానాలు చూస్తుం టే అసలు ఈ కుంభకోణం గుట్టు వీడుతుందా? దీని వెనకున్న పెద్దలకు శిక్షలు వేసి.. దోచుకున్న ప్రజాధనాన్ని కక్కిస్తారా అంటే అనుమానమే అని అర్థమవుతోంది.

ఎకరాకు.. రూ.52.51 లక్షలు స్వాహా

జగనన్న లేఅవుట్లు ఎక్కడనేది తెలుసుకున్న వైసీపీ నాయకులు కొందరు ముందుగానే రైతుల నుంచి ఎకరాకు రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షలు చెల్లించి పొలాలు కొనుగోలు చేశారు. బినామీ పేర్లతో వాటిని ప్రభుత్వానికి రూ.92.51 లక్షలు అమ్మారు. వారం రోజుల్లోనే వీరికి ఎకరాకు రూ.52.51 లక్షలు అప్పనంగా వచ్చి చేరింది. భూమిని నమ్ముకుని ఉన్న రైతుకు రూ.40 లక్షలే అందితే, వారంలో చేతులు మార్చిన వైసీపీ దళారులకు ఎకరాకు రూ.52 లక్షలు దక్కింది.

తెనాలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను నిజం చేస్తామంటూ కోట్లకు కోట్లు వైసీపీ పెద్దలు దోచేశారు. కాలనీలు కాదు.. ఊళ్లు నిర్మిస్తున్నామని జేబులు నింపుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంతగొప్ప కార్యక్రమం చేసిన ప్రభుత్వమే లేదని భూమాయ చేశారు. ఇది ఒక్క గుంటూరు జిల్లానే కాదు. రాష్ట్రం మొత్తం మీద (మిగతా 8వ పేజీలో)

ముఖ్య నేత పేరుతో వసూళ్లు..

- బుర్రిపాలెం, నేలపాడు, అంగలకుదురు, గుడివాడ, కొలకలూరులలో కొన్ని భూములకు ఎకరాకు రూ.10 నుంచి రూ.20 లక్షల వరకు వాటాల కింద వసూలు చేశారు. అదేమంటే ఈ డబ్బు ముఖ్య నేతకు ఇవ్వాలంటూ నిలబెట్టి వసూలు చేశారని రైతులు చెప్తున్నారు. ఒక ప్రవచన కర్త ఇంటిపేరుతో ఉన్న రైతు 6.5 ఎకరాలు ప్రభుత్వానికి ఇచ్చినందుకు అందిన మొత్తంలో నేతలకు వాటా రూపంలో ఇచ్చిన మొత్తమే రూ.1.8 కోట్లు అంటే, ఎంతటి స్థాయిలో డబ్బు చేతులు మారిందనేది అర్థమవుతుంది. ఓ లేఅవుట్‌లో 12 మంది 36 ఎకరాల భూమిని ఇచ్చినందుకు నేతలకు ఇచ్చిన వాటా రూ.8 కోట్లని సమాచారం. ఇలా మొత్తం 526 ఎకరాల్లో అందిన మొత్తం లెక్కిస్తే కళ్లు తిరగాల్సిందే.



నేలపాడులో ఆగిపోయిన పేదల ఇళ్లు



జిన్నింగ్.. దివాలా

నష్టాల ఊబిలో పరిశ్రమ


- 400 మిల్లుల్లో పనిచేస్తున్నవి 120 మాత్రమే
- రూ.30 కోట్ల ప్రోత్సాహకాల కోసం ఎదురుచూపు
- పన్నుల భారం తగ్గించాలని యజమానుల విజ్ఞప్తి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు కళకళాడిన జిన్నింగ్ పరిశ్రమ దివా లా దిశగా సాగుతోంది. ఉత్పత్తి వ్యయం పెరిగిపోవడం.. పత్తి విస్తీర్ణం పూర్తిగా పడిపోవడం.. పన్నులు మోత.. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహ కాలు లేకపోవడం.. తదితరాల నేపథ్యంలో పరి శ్రమను నష్టాల ఊబిలో పడేస్తోంది. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా గతంలో 400 వరకు ఉన్న జిన్నింగ్ మిల్లులు ప్రస్తుతం కేవలం 120 మా త్రమే ఉనికిలో ఉన్నాయి. గుంటూరు రీజియన్‌లో 60 మిల్లులు, రాయలసీమ రీజియన్‌లో 60 మిల్లులు ఉండగా ప్రభుత్వం నుంచి సుమారు రూ.30 కోట్ల వరకు ప్రోత్సాహకాలు రావాల్సి ఉంది. గడిచిన ఐదేళ్ల కాలంలో వాటి విడుదల కోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని యజమానులను అసంతృప్తి చెందుతున్నారు. 2014 తర్వాత విభజిత రాష్ట్రంలో పత్తి విస్తీర్ణం పూర్తిగా పడిపోవడం పరిశ్రమకు కోలుకోలేని దెబ్బ తగులుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 10 లక్షల బేళ్లకు సరిపడా మాత్రమే పత్తి దిగుబడి వస్తుండగా, ఉనికిలో ఉన్న జిన్నింగ్ మిల్లులు 30 లక్షల బేళ్ల సామర్థ్యం కలిగి ఉన్నాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌లో మాత్రమే మిల్లులు ఆడే పరిస్థితి నెలకొంది. మిగిలిన సంవత్సరమంతా మూతపడి ఉంటున్నా విద్యుత్ చార్జీలు, ఇతర పన్నుల భారం మాత్రం తప్పడం లేదు. మిగిలిన రాష్ట్రాల్లో పత్తి ఆధారిత పరిశ్రమలకు విద్యుత్ రాయితీలు పుష్కలంగా ఇస్తున్నా ఇక్కడ ఆ విధానం లేదు. హై టెన్షన్‌లో జిన్నింగ్ పరిశ్రమలను చూపడంతో కనీస డిమాండ్ చార్జీలు ఎక్కువగా పడుతున్నట్లు యజమాను లు చెబుతున్నారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ము గిసిన తర్వాత కొందరు జిన్నర్స్ ఇతర రాష్ట్రాల నుంచి పత్తిని కొనుగోలు చేయడం వల్ల రెండు రాష్ట్రాల్లో మార్కెటింగ్ సెస్సు చెల్లించాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఇటీవల ఏపీ టీఎంసీ కన్సార్టియం రాష్ట్ర అధ్యక్షుడు ఇక్కుర్తి శివ ప్రసాద్, సీనియర్ నాయకుడు మన్నవ హరి గుంటూరులో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి సమస్యలను వివరించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రోత్సాహకాలు వెంటనే విడుదల చేయించాలని, బ్యాంకు వడ్డీ రేట్లలో కొంత వరకు తగ్గించాలని, జీఎస్టీ రాయితీ కల్పించాలని, మార్కె టింగ్ సెస్సు పూర్తిగా తగ్గించాలని, పత్తి విస్తీర్ణం పెంచేందుకు తెగుళ్లను తట్టుకునే మంచి వంగడాలను రైతులకు సరఫరా చేయాలని, రాష్ట్రంలో సీసీఐ పత్తి కొనుగోళ్ల పెంచాలని కోరారు.

పాలిసెట్.. పాట్లు

- ఫీజు చెల్లింపులో సాంకేతిక సమస్యలు
- ఉండీ ఉపయోగం లేని హెల్ప్‌లైన్ సెంటర్
- విద్యార్థుల ఇబ్బందులపై స్పందించని సిబ్బంది

గుంటూరు(విద్య), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ గడువు సమీపిస్తోంది. పరీక్షకు ఫీజు చెల్లించేందుకు విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాంకేతిక సమస్యల కారణంగా ఫీజు చెల్లింపులో అవాంతరాలు ఎదురవుతున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మంగళగిరిలోని సాంకేతిక శాఖ ప్రధాన కార్యాలయంలో సిబ్బంది విద్యార్థుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడంలేదు. ఇక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినా దానివల్ల ఫలితం లేదని విద్యార్థులు వాపోతున్నారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం సాంకేతిక విద్యాశాఖ పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏటా పాలిసెట్‌కు దాదాపు 20 వేల మందికి పైగా విద్యార్థులు హాజరవుతుంటారు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడు పాలిసెట్‌కు ఈ నెల 15వ తేదీ చివరి తేదీగా గడువు ఇచ్చింది. గత నెల చివర్లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు భారీ సంఖ్యలో పాలిసెట్ రాసేందుకు సన్నద్ధమయ్యారు. పదో తరగతి హాల్‌టికెట్ నంబర్ ద్వారా పాలిసెట్‌కు దరఖాస్తుకు సాంకేతికశాఖ అవకాశం ఇచ్చింది. అయితే హాల్ టికెట్లోని వివరాలతో పాటు అదనపు సమాచారం నింపి పరీక్ష ఫీజు చెల్లింపు కోసం విద్యార్థులు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. అనేకమంది విద్యార్థులు డెబిట్ కార్డును ఉపయోగించి ఫీజు చెల్లిస్తున్నారు. అయితే ఫీజు చెల్లింపు స్టేటస్‌లో ఫీజు చెల్లించలేదని లేదని ఆన్‌లైన్ ప్రత్యక్షమవుతుంది. మొత్తం ప్రక్రియ పూర్తి చేసి నగదు కట్ అయినా ఫీజులు జమ కాలేదంటూ సాంకేతిక విద్యా శాఖ నుంచి ఫోన్లకు వస్తున్న సమాచారంతో విద్యార్థులు బెంబేలెత్తుతున్నారు. దీంతో ఏమి చేయాలో పాలుపోక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.



06 Apr 2025	
Debited	₹ 400.00 Dr
Description	POS:SBTETAP/ Mumbai/509611044766
05 Apr 2025	
Debited	₹ 400.00 Dr
Description	POS:SBTETAP/ Mumbai/509513972963

ఓ విద్యార్థి రెండుసార్లుగా చెల్లించిన పరీక్ష ఫీజు బ్యాంకు రశీదులు

స్పందించని హెల్ప్‌లైన్ సెంటర్లు

పాలిసెట్ విద్యార్థుల సమస్యలకు పరిష్కారం కోసం మంగళగిరిలో ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇందులో ఇందులో డేటా ఎనాలసిస్ట్, సాంకేతిక విద్యాశాఖ సెక్రటరి కార్యాలయ సిబ్బంది, మరో రెండు హెల్ప్‌లైన్ సెంటర్ నెంబర్లు పొందుపరిచారు. అయితే ఈ నెంబర్లకు ఫోన్ చేసినా అక్కడి నుంచి స్పందన రావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక సమస్యలను కార్యాలయ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లాలన్నా ఫలితం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ల్యాండ్‌లైన్ నెంబర్ కూడా పనిచేయడం లేదని ఫలితంగా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకావడంలేదంటున్నారు. చివరకు మెయిల్ చేస్తే మీ డబ్బు 15 రోజుల్లో తిరిగి మీ ఖాతాకే వస్తుందన్న సమాచారం పంపి చేతులు దులుపుకుంటున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.



మంగళగిరిలోని హెల్ప్‌లైన్ సెంటర్ ఫోన్ నెంబర్లు

మంగళగిరిలో.. అత్యాధునికంగా ఆస్పత్రి

- దేశానికి రోల్‌మోడల్‌గా వంద పడకలతో నిర్మాణం
- 13న శంకుస్థాపన చేయనున్న మంత్రి లోకేశ్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక వైద్య సదుపాయాలతో.. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా.. దేశానికే రోల్ మోడల్‌గా మంగళగిరిలో వంద పడకల ఆస్పత్రి నిర్మించనున్నారు. మంగళగిరి నియోజకవర్గ ప్రజల మూడు దశాబ్దాల కలకి ఈ నెల 13న మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయనున్నారు. వంద పడకల ఆస్పత్రిని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని మంత్రి నారా లోకేశ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఏడాదిలోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. యువగళం పాదయాత్ర సందర్భంగా మంగళగిరి ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఏరియా ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. గతేడాది అక్టోబరు 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలో మంత్రి లోకేశ్ ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించింది. దీంతో 1986లో ఏర్పాటు చేసిన ఆస్పత్రి భవనం శిథిలం కావడంతో వైద్యశాలను చినకాకాని వద్దకు మార్చి, కేన్సర్ ఆస్పత్రి స్థలాన్ని వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి కేటాయించారు. 7.35 ఎకరాల్లో లక్షా 15 వేల చదరపు అడుగుల్లో సువిశాలంగా ఆస్పత్రి భవనాన్ని రూ.52.20 కోట్లతో నిర్మించనున్నారు. ఆస్పత్రిలో మెడికల్, సర్జికల్, ఆర్థో, గైనిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ విభాగాలు, మూడు ఆపరేషన్ థియేటర్లు, డయాలసిస్ సెంటర్, తలసేమియా వార్డు, డీ అడిక్షన్ ఓపీ సెంటరు అందుబాటులోకి తేనున్నారు.



వంద పడకల ఆస్పత్రి తాలూకూ నమూనా చిత్రం

ఫైనాన్స్ కంపెనీ ఆగడాలతో మహిళ ఆత్మహత్య

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఫైనాన్స్ కంపెనీ ఆగడాలను రుణ గ్రహీతలు తట్టుకోలేకపోతున్నారు. వాయిదాలు చెల్లించలేదని రుణగ్రహీతలపై దౌర్జన్యాలకు పాల్పడటంతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని వెల్లటూరుకు చెందిన బాణావత్ పార్వతి (45) గోవింద్ దంపతులు రెండేళ్ల క్రితం ఫైవ్‌స్టార్ ఫైనాన్స్ కంపెనీలో తమ ఇంటిని తనఖా పెట్టి రూ.3 లక్షలు రుణం తీసుకున్నారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందుల కారణంగా వాయిదాలు సక్రమంగా చెల్లించకపోవడంతో కంపెనీ ఏజెంట్లు పార్వతి ఇంటిలోని సామాన్లు బయటకు విసిరేయడంతో పాటు ఇంటికి తాళం వేశారు. స్థానికులు, బంధువులు ఏజెంట్లను బతిమలాడి నచ్చజెప్పడంతో మరో దఫా వాయిదాలు సక్రమంగా చెల్లించకపోతే ఊరుకోమని హెచ్చరించి ఇంటికి వేసిన తాళాన్ని ఇచ్చి వెళ్లారు. ఈ సంఘటనో మనస్థాపానికి గురైన పార్వతి మంగళవారం సాయంత్రం ఇంటిలో ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కొన ఊపిరితో ఉన్న ఆమెను తెనాలి వైద్యశాలకు అక్కడ నుండి గుంటూరు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కుమారుడు శివశంకర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివయ్య ఫైనాన్స్ కంపెనీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిన్నెల్లి సోదరుడు మాకు అన్యాయం చేశాడు

ఎస్పీ ఎదుట అనాథ వృద్ధ దంపతుల ఆవేదన


ఎస్పీ శ్రీనివాసరావు ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న వృద్ధ దంపతులు

మాచర్ల రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి తమ కేసు పరిష్కారం కాకుండా అడ్డుకొని అన్యాయం చేశారని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఎదుట అనాద వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయంపై గతంలో వారు ఫిర్యాదు చేశారు. దానిపై విచారణకు ఎస్పీ గురువారం విజయపురి సౌత్ వచ్చారు. మండలంలోని విజయపురిసౌత్‌లో నివాసం ఉంటున్న అరికట్ల బ్రహ్మారెడ్డి, విజయలక్ష్మి వృద్ధ దంపతులు 8.5 ఎకరాల పొలంతోపాటు ఆస్తులను మొత్తం అమ్మి తమ కొడుకు అంజిరెడ్డిని ఉన్నత చదువులు చదివించడంతో, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడ్డారని చెప్పారు. అయితే తాము అనారోగ్యంతో బాధపడుతున్నా, తమ కొడుకు అంజిరెడ్డి తమను పట్టించుకోవడం లేదన్నారు. తమ పరిస్థితి మరింత దుర్భరంగా మారడంతో, ఆత్మహత్యాయత్నానికి కూడా యత్నించామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాచర్ల పోలీసులకు తమ కొడుకుపై ఫిర్యాదు చేస్తే పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, తమ కుమారునికి మద్దతుగా నిలిచి కేసు పరిష్కారం కాకుండా చేశాడన్నారు. ఎన్నిసార్లు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దిక్కులేక కోర్టులో కేసు వేశామని, నెలకు రూ. 10 వేలు భరణం ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. కోర్టు తీర్పును కూడా తమ అంజిరెడ్డి ఖాతరు చేయలేదని ఎస్పీకి తెలిపారు. న్యాయం తప్పక చేస్తామని ఎస్పీ శ్రీనివాసరావు వృద్ధ దంపతులకు హామీ ఇచ్చారు. ఎస్పీ వెంట మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్, మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, విజయపురిసౌత్ ఎస్ఐ మహ్మద్ షఫి ఉన్నారు.

డీఎస్సీ కి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ , ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఆన్లైన్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి కే మయూరి గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. అభ్యర్థులు టెట్ పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలని వార్షిక ఆదాయం లక్షలోపు ఉండాలని సూచించారు. ఆసక్తి అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తుతో పాటు పదవ తరగతి మార్కుల జాబితా, టీటీసీ లేదా బీఈడీ పాస్ అయినట్లు సర్టిఫికెట్లు, తల్లిదండ్రుల వార్షిక ఆదాయ ధ్రువీకరణ పత్రం,రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ తదితర వివరాలను గుంటూరు రాజా గారి తోటలోని బీసీ స్టడీ సర్కిల్ కు పంపాలని సూచించారు వివరాలు కోసం 0863- 2358071 నంబర్ లో సంప్రదించాలని సూచించారు.

యార్డు మాజీ సెక్రటరీపై అభియోగాల నమోదు

వాటిపై విచారణ జరపాలని ప్రభుత్వ నిర్ణయం ● ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రస్తావించిన వ్యవసాయ సహకార శాఖ



గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు(గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ) మాజీ సెక్రెటరీ వీ ఆంజనేయులుపై విచారణ జరపాలని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ నిర్ణయించింది. మంత్రి కే అచ్చెన్నాయుడు మార్కెటింగ్ శాఖ అధికారులకు రాసిన లేఖ విషయంలో గోప్యత పాటించకుండా దానిని హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటీషన్‌లో జత చేయడమే ఇందుకు కారణం. ఇదే విషయాన్ని ఆంధ్రజ్యోతి ఈ ఏడాది జనవరి 21వ తేదీన 'మంత్రి లేఖ బట్టబయలు' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. వ్యవసాయ శాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బుడితి రాజశేఖర్ గురువారం జారీ చేసిన ఉత్తర్వులు జీవో ఆర్ టీ నంబరు. 189లో ఆంధ్రజ్యోతి కథనాన్ని ఉటంకిస్తూ విచారణకు ఆదేశించారు.

మూడు నెలల పాటు మిర్చియార్డుకు ఇన్‌ఛార్జ్ సెక్రెటరీగా వీ ఆంజనేయులు వ్యవహరించారు. రాజమహేంద్రవరం ఏఎంసీ కార్యదర్శిగా ఉన్న ఆయన్ని ఇన్‌ఛార్జ్ ఏర్పాట్లపై గుంటూరు మిర్చియార్డుకు నియమించింది. అయితే ఆయన ఛార్జ్ తీసుకొన్న నెలన్నర వ్యవధిలోనే మరో అధికారిని పోస్టింగ్ చేసేందుకు మార్కెటింగ్ శాఖలో ఫైలు నడిచింది. ప్రస్తుత కార్యదర్శి ఏ చంద్రిక డిప్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా అందుకు మంత్రి సమ్మతిస్తూ మార్కెటింగ్ శాఖకు పంపించారు. దీనికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలను మార్కెటింగ్ శాఖ నుంచి సేకరించిన అప్పటి ఇన్‌ఛార్జ్ సెక్రెటరీ ఆంజనేయులు హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారు. దాంతో పాటు మంత్రి లేఖని కూడా జోడించారు. ఈ విషయం బహిర్గతం కావడంతో ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది.

అధికారిక ఉత్తర్వుల విషయంలో గోప్యత పాటించకపోవడంతో ఆంజనేయులుపై ప్రభుత్వం అభియోగాలను నమోదు చేసింది. వాటిపై విచారణ నిర్వహించేందుకు నిర్ణయం తీసుకొన్నది. ఈ నేపథ్యంలో ఆయనపై నమోదు చేసిన అభియోగాలకు సంబంధించి 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వకపోతే చర్యలు తప్పవని హెచ్చరించింది. అలానే ఎంక్వయిరీ అధికారులపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు తీసుకురాకూడదని స్పష్టం చేసింది.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

36 ద్విచక్ర వాహనాలు స్వాధీనం... అభినందించిన ఎస్పీ తుషార్ డూడీ


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు బాపట్ల డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. గురువారం భట్టిప్రోలు పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొంత కాలంగా బాపట్ల, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు తదితర జిల్లాలతో పాటు తెలంగాణాలో కూడా ద్విచక్ర వాహనాలను చోరీకి పాల్పడుతున్న ముగ్గురు నేరస్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిలో ప్రధాన ముద్దాయి తెనాలికి చెందిన పుట్టా శివశంకర్ ఆటోలు నడుపుకుని జీవనం సాగించేవాడని, చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు అలవాటు పడి రైల్వే స్టేషన్, బస్టాండ్, సినిమా హాలు వద్ద పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను నకిలీ తాళాలతో చోరీకి పాల్పడుతుంటాడన్నారు. అతనికి కోడి పందాల వద్ద చెరుకుపల్లి మండలం కనగాలకు చెందిన పీటా నాగబాబు, ఐలవరంకు చెందిన దీపాల తేజ్‌వెంకటనాగసాయి విజయ్‌కుమార్ పరిచయమయ్యారన్నారు. శివశంకర్ పలు చోట్ల చోరీ చేసిన ద్విచక్ర వాహనాలను వీరి వద్ద భద్రపరుస్తూ ఉంటాడన్నారు. శివశంకర్‌పై వివిధ పోలీస్ స్టేషన్‌లలో దొంగతనం కేసులు నమోదు అయి వున్నాయన్నారు. నాగబాబుపై చెరుకుపల్లి పోలీస్ స్టేషన్‌ఓ చీటింగ్ కేసు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. భట్టిప్రోలులోని హోసన్న మందిరం వద్ద ఓ గృహంలో ఉన్న మోటారు సైకిల్ చోరీ జరిగింది. బాధితుడు ఫిర్యాదు మేరకు, ఎస్పీ ఆదేశాలతో, డీఎస్పీ ఆధ్వర్యంలో వేమూరు సీఐ పసుపులేటి వీరాంజనేయులు, రేపల్లె రూరల్ సీఐ సురేష్‌బాబు సారధ్యంలో భట్టిప్రోలు, చెరుకుపల్లి ఎస్ఐలు శివయ్య, అనీల్‌కుమార్ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అత్యంత చాకచక్యంగా అరెస్టు చేసి వారి వద్ద రూ.25లక్షలు విలువ కలిగిన 36 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసిన డీఎస్పీ శ్రీనివాసరావుతో పాటు వేమూరు, రేపల్లె రూరల్ సీఐలను భట్టిప్రోలు, చెరుకుపల్లి ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ తూషార్‌డూడీ ప్రత్యేకంగా అభినందించారని ఆయన వివరించారు.

తృణధాన్యాల ఉత్పత్తులలోకి తెనాలి డబుల్ హార్స్ గ్రూప్



తృణధాన్యాల ఉత్పత్తుల ఆవిష్కరణలో డబుల్ హార్స్ ఎండీ శ్యాంప్రసాద్, డాక్టర్ సంగీతారెడ్డి, యాంకర్ సుమ, నిర్మాత దిల్‌రాజు తదితరులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పప్పుల విక్రయంలో ప్రముఖ స్థానం పొందిన డబుల్ హార్స్ సంస్థ తాజాగ తృణ ధాన్యాల ఉత్పత్తులలోకి ప్రవేశించిందని సంస్థ ఎండీ మునగాల శ్యాంప్రసాద్ తెలిపారు. మిల్లెట్ మార్వెల్స్ పేరుతో తయారు చేసిన ఉత్పత్తులను గురువారం హైదరాబాద్‌లో అపోలో హాస్పటల్ జేఎండీ డాక్టర్ సంగీతారెడ్డి చేతుల మీదుగా మార్కెట్‌లోకి విడుదల చేసినట్లు తెలిపారు.

హెల్త్ మిక్స్ డయాబెటిక్ ఫ్రెండ్లీ మిక్స్, సెమోలినా, పాస్తా, నట్స్, డ్రైడ్ ఫ్రూట్స్ వంటి ఉత్పత్తులను క్రమంగా తెనాలి డబుల్ హార్స్ మార్కెట్‌లోకి తెస్తుందని శ్యాంప్రసాద్ చెప్పారు. ఆర్గానిక్ ఉత్పత్తులను కూడా రానున్న రోజుల్లో విడుదల చేసేందుకు సిద్ధం అవుతున్నామని, తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలకు కూడా మిల్లెట్ మార్వెల్స్ అందిస్తామన్నారు. ఆ తరువాత పాన్ ఇండియా మార్కెట్‌లో విస్తరిస్తామని రానున్న మూడేళ్లలో ఐదు శాతం ఆదాయం మిల్లెట్ మార్వెల్స్ ద్వారా సమకూరేందుకు లక్ష్యం పెట్టుకున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సంస్థ సేల్స్ టర్నోవర్ రూ.535కోట్లకు చేరిందని రానున్న మూడేళ్లలో దీనిని నాలుగు అంకెలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 12 దేశాలలో తమ బ్రాండెడ్ కమోడిటీస్ అడుగు పెట్టాయని, దేశంలోని 15 రాష్ట్రాలలో ఖాతాదారులకు చేరువ అయ్యామన్నారు. జనరల్ ట్రేడ్, మోడ్రన్ ట్రేడ్, ఈ-కామర్స్, క్విక్ కామర్స్ ద్వారా వినియోగదారులకు ఉత్పత్తులు అందిస్తున్నామన్నారు. బ్రాండెడ్ అవుట్‌లెట్లు ఏర్పాటు చేస్తూ వినియోగదారులకు చేరువ అవుతామని చెప్పారు. కార్యక్రమంలో యాంకర్ సుమ, నిర్మాత దిల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కొడుకుని రక్షించబోయి.. తండ్రి మృతి

మాచవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కళ్ళెదుటే తన కుమారుడు నీటి కుంటలో మునిగి పోతూ ఉంటే ఏ తండ్రి అయినా చూస్తూ ఊరుకుంటా డా?...తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కొడుకుని రక్షించి చివరకు తన ప్రాణాలను తీసు కున్న విషాద సంఘటన మండలంలోని శ్రీ రుక్మిణీపురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మేకలను మేపుకొనేందుకు దేశబోయిన వెంకటేశ్వర్లు(40) అతని కుమారుడు మణికంఠ, మేనల్లుడు వెంకటేశ్వర్లు ముగ్గురు కలసి వెళ్ళారు. పగలంతా మేకలను మేపు కొని తిరిగి ఇంటికి వస్తున్న తరుణంలో మేకలకు నీరు తాగించేందుకు కృష్ణా నది ఒడ్డు సమీపంలోకి వెళ్ళారు. శ్రీ రుక్మిణీపురం, నాగేశ్వరపురం తండా గ్రామాల సమీపంలో ఉన్న పిల్లేరు వాగు కృష్ణా నదిలో కలిసే ప్రాంతంలో మేకలకు నీరు తాగించేందుకు పూనుకున్నారు.

ఆ సమయంలో మేకలు నీటిలో కొట్టుకు పోతాయనే ఉద్దేశంతో ముందుగా వెంకటేశ్వర్లు కు మారుడు మణికంఠ నీటిలోకి దిగాడు. అదే సమ యంలో కింద పూడు ఉండటంతో మునిగి పోతు న్నాడు. ఇది గమనించిన తండ్రి వెంకటేశ్వర్లు కొడు కును రక్షించేందుకు తాను నీటిలోకి దిగి కొడుకును పైకి లాగి తాను పూడిలో కూరుకు పోతున్నాడు. ఇది గమనించిన మేనల్లుడు వెంకటేశ్వర్లు మేన మామను రక్షించేందుకు తన ఒంటి మీద ఉన్న లుంగీని తీసివేసి వెంకటేశ్వర్లుకు అందించే ప్రయ త్నం చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. వెంకటేశ్వర్లు పూడిలో కూరుకు పోయి చనిపోయాడు. ఇరుగురు పొరుగు వారి ద్వారా సమాచారాన్ని బంధువులకు చేర వేశారు. బంధువులు మాచవరం పోలీసులకు సమా చారాన్ని ఇవ్వగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మత్స్య కారుల ద్వారా మృత దేహాన్ని వెలికి తీశారు. వెంకటేశ్వర్లు తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల వైద్యశాలకు తరలించారు.

ఆర్మీలో ఉద్యోగాలకు రిజిస్ట్రేషన్ తేదీ పొడిగింపు

● ఈ నెల 25వ తేదీ వరకు అవకాశం

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యంలో నియామకాలకు రిజిస్ట్రేషన్ గడవు తేదీని పొడిగించినట్లు ఆ సంస్థ గుంటూరు బ్రాంచ్ రిక్రూటింగ్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ జూన్ నెలలో తెలుగుతో సహా 13 వేర్వేరు భాషలలో నిర్వహించడం జరుగుతుంది. గుంటూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఆసక్తిగల అభ్యర్థులు అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్ అసిస్టెంట్, క్లర్కు/స్టోర్‌కీపర్ టెక్నికల్, ట్రేడ్స్‌మెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియపరిచింది. నియామక ప్రక్రియ పూర్తిగా ఆటోమేటెడ్, న్యాయపరంగా, పారదర్శకంగా ఉంటుందని తెలిపింది. అభ్యర్థులు ఎవ్వరూ దళారీలు, ఏజంట్లు, ఏజెన్సీల ప్రలోభాలకు గురికావొద్దని సూచించింది.

జూన్ నెలాఖరు వరకు తిరుపతి, షిర్డి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో తిరుపతి, షిర్డి సందర్శనకు వెళ్లే యాత్రీకుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే జూన్ నెలాఖరు వరకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ఆ సంస్థ సీపీఆర్‌వో ఏ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నంబరు 07637 తిరుపతి - సాయినగర్ షిర్డి ప్రత్యేక రైలు ఈ నెల 13 నుంచి జూన్ 29వ తేదీ వరకు ప్రతీ ఆదివారం బయలుదేరి చీరాల, బాపట్ల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరుసటి రోజు సాయినగర్ షిర్డి చేరుకొంటుంది. నంబరు. 07638 సాయినగర్ షిర్డి - తిరుపతి ప్రత్యేక రైలు ఈ నెల 14 నుంచి జూన్ 30వ తేదీ వరకు ప్రతీ సోమవారం బయలుదేరి మంగళవారం తిరుపతికి చేరుకొంటుంది.

చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి ప్రత్యేక రైళ్లు

నంబరు. 07025 చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు ప్రత్యేక రైలు ఈ నెల 11 నుంచి జూన్ 27వ తేదీ వరకు ప్రతీ శుక్రవారం బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకొంటుంది. నంబరు. 07026 శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 12 నుంచి జూన్ 28వ తేదీ వరకు ప్రతీ శనివారం బయలుదేరి మరుసటి రోజు చర్లపల్లి చేరుకొంటుందన్నారు.

పవన్ కళ్యాణ్ తనయుడిపై అనుచిత పోస్టింగ్స్.. ప్రత్తిపాడు స్టేషన్‌లో కేసు నమోదు

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : సింగపూర్ స్కూల్లో అగ్ని ప్రమాదంలో చిక్కుకొని హాస్పిటల్లో చికిత్స పొందుతున్న డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ రెండవ కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్‌పై సోషల్ మీడియా వేదికగా సభ్య సమాజం తలదించుకునే విధంగా ఆటవికమైన భాషతో కామెంట్స్ చేసిన సోషల్ మీడియా హ్యాండిల్, సమూహంపైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలసి ఫిర్యాదు చేసారు. ఈ నేపథ్యంలో ఆయా పోస్టింగ్స్ పెట్టిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన ఎస్పీను కలసి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసారు. ఎస్పీని కలసిన వారిలో ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకటరత్తయ్య, జిల్లా కార్యదర్శి డేగల లక్ష్మణ్, నగర ఉపాధ్యక్షులు రేణుక రాజు, నియోజకవర్గ నాయకులు నాగినేని సునీల్‌కుమార్, కోటి శ్రీనివాసరావు, కొండా చంద్రశేఖర్, రాజు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నాయకుల్లో తగ్గని అహంకారం

మాజీ ఎంపీ గోరంట్ల వ్యవహారంపై ఎమ్మెల్యే నరేంద్ర

పొన్నూరు టౌన్ ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చేసిన అరాచక పాలన దుర్మార్గ నిర్ణయాలకు అధికారం కోల్పోయిన వైసీపీ నాయకులలో అహకారం మాత్రం తగ్గలేదని ఎమ్మెల్యే , సంగం డెయి రీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ గురువారం అన్నారు. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వ్యవహారమే వైసీపీ నాయకుల అహంకార వైఖరికి నిదర్శనమన్నారు. చేబ్రోలు కిరణ్ అనే సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు వ్యవహరంలో గోరంట్ల మాధవ్ పోలీసుల సమాచారంతోనే సంఘటన స్థలానికి చేరుకుని దాడికి పాల్పడ్డాడని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులలో ఉన్న వైసీపీ సానుభూతి పరుల సమాచారంతోనే గోరంట్ల మాధవ్ కిరణ్‌ను తరలిస్తున్న వాహనాలను అనుసరిస్తూ వస్తూ పోలీసుల సమక్షంలోనే దాడి చేసే దుస్సాహసానికి పాల్పడ్డాడని ఎమ్మెల్యే ఆరోపించారు. చేబ్రోలు కిరణ్ వైసీపీ నాయకుల కుటుంబ సభ్యుల పై అనుచిత వ్యాఖ్యలు చేశారని కూటమి ప్రభుత్వమే ముందుగా స్పందించి చట్ట పరంగా కిరణ్‌ను శిక్షించేందుకు అరెస్టు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు. మాధవ్ వ్యవహారం పై పోలీసుల సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లేదంటే కస్టడీలో ఉన్న కిరణ్ పై జరిగిన దాడి పోలీసుల వైఫల్యమే అవుతుందన్నారు.

రేపటి నుంచి కొండవీటి కళాపరిషత్ నాటికల పోటీలు

యడ్లపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : రెండున్నర దశాబ్దాలకు పైగా నాటిక పోటీలు నిర్వహిస్తున్న కొండవీడు కళాపరిషత్. ఈ నెల 12 నుంచి మూడు రోజులపాటు 26వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలను నిర్వహిస్తున్నారు. పల్నాడు జిల్లా లింగారావుపాలెం గ్రామంలో గల జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలోని పోసాని సుబ్బారావుచౌదరి స్మారక కళావేదిక పై 12,13,14 తేదీలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు మూడు నాటికల చొప్పున మొత్తం 9 నాటికలు ప్రదర్శితం కానున్నాయి. ఆయా పోటీల్లో ఉత్తమంగా నిలిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రదర్శనలకు నగదు బహుమతులు, కళాకారులకు జ్ఞాపికలు, ప్రతి నాటికకు ప్రదర్శన పారితోషికం ఇస్తున్నామని వివరించారు. అలాగే ఉత్తమ రచయిత, ఉత్తమ దర్శకుడికి ప్రత్యేక నగదు బహుమతులు, షీల్డులు ఇవ్వనున్నట్లు పరిషత్ అధ్యక్షులు కట్టా శ్రీహరిరావు, కార్యదర్శి మండెపూడి శ్రీనివాసరావ, ఉపాధ్యక్షులు తోకల సాంబశివరావు, సభ్యులు తెలిపారు.

వీఆర్‌కు గురజాల డీఎస్పీ

గురజాలటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గురజాల డీఎస్పీ జగదీష్ వీఆర్‌కు గురువారం బదిలీ అయ్యారు. ఆయన్ను ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

1,22,136 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,25,167 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,22,136 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 65,764 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13200
నంబరు. 5	10000	13300
273	10000	12600
341	10500	13600
4884	10000	11500
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10000	12400
బ్యాడిగి 355	10000	13200
సింజెంటా బ్యాడిగి 5531	--	--
దేవనూరు డీలక్స్	10000	12400
ఆర్మూరు	9800	11000
తాలుకాయలు	4500	6500

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థులకు ఉద్యోగాలు

గుంటూరు విద్య, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్ వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ప్రాంగణ నియామకాల్లో 16మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మేథో సర్వ్ డ్రైవ్స్, సన్ గ్లేర్ టెక్నాలజీస్, టెక్‌బోట్స్, ఉపాధి టెక్నో సర్వీసెస్, న్యూకాన్ ఏరోస్పేస్, రాక్స్ సివిల్ టెక్నోకార్ట్స్, జెస్పీడ్ క్రయో టెక్నాలజీస్ కంపెనీలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించాయని తెలిపారు. ఎంపికైన వారు రూ 3లక్షల నుంచి రూ.5.5 లక్షల వార్షిక వేతనంతో కూడిన ప్యాకేజీలు అందుకున్నట్లు వివరించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, వివిధ విభాగాధిపతులు అభినందించారు.


డీఆర్‌ఎంని కలిసిన స్కౌట్స్ అండ్ గైడ్స్

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు స్ఫూర్తిదాయకం

గుంటూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు, జనసమూహం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ నిర్వహించే సేవలు స్ఫూర్తిదాయకమని గుంటూరు రైల్వే డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ అన్నారు. గురువారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ డీఆర్‌ఎంని కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కే సైమన్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్ తదితరులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాల ఘనత వైసీపీదే..

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):


కె.సురేష్

హత్యా రాజకీయాల ఘనత వైసీపీకే దక్కుతుందని టీడీపీ రాష్ట్ర నాయకుడు కొర్రపాటి సురేష్ ఎద్దేవాచేశారు. స్థానిక నగరంపాలెంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ హయాంలో నియంత నిర్ణయాలతో ప్రజల మానప్రాణాలకు రక్షణ కరువైందని గుర్తుచేశారు. అనేక మంది టీడీపీ కార్యకర్తలను బలిగొన్న చరిత్ర జగన్‌ది అన్నారు. చంద్రబాబు పాలనలో అంబేడ్కర్ రాజ్యాంగం అమలు జరుగుతుందన్నారు. వైసీపీలో జరిగిన దాడులు, అప్పుడు జరిగిన మారణకాండ, ఇప్పుడు ఉన్న పరిస్థితులపై జిల్లా వైసీపీ అధ్యక్షుడు అంబటి రాంబాబు బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు.

చిట్టీల నిర్వాహకురాలు పరార్

గుంటూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాకేతపురానికి చెందిన చిలకపాటి మస్తానమ్మ ఆ ప్రాంతంలోని అనేకమంది వద్ద చిట్టీల పేరుతో సుమారు రూ.20లక్షల వరకు వసూలు చేసి గత కొన్నాళ్లుగా తప్పించుకు తిరుగుతోంది. ఆమె కుమార్తెలు డబ్బులు తిరిగి ఇస్తామని ఇన్నాళ్లూ మభ్యపెట్టి చీటీదారులను మోసం చేసినట్లు అన్నెం సీత మరికొందరు కలిసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త, అత్తమామలపై వేధింపుల కేసు

అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంజీవయ్యనగర్‌కి చెందిన షేక్ నజ్మా భర్త ఇమ్రాన్ రాపిడోలో పనిచేస్తుంటాడు. వారికి ముగ్గురు మగపిల్లలు. నజ్మా భర్త మద్యానికి బానిసై భార్యని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. ఈ విషయం తన తల్లి, సోదరుడికి చెప్పగా వారు ఆమె భర్తని సమర్థిస్తూ, వారూ కూడా నజ్మాని చంపుతామని బెదిరిస్తున్నట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న అరండల్ పేట పోలీసులు తెలిపారు.

మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి

గుంటూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ బీవీ సుబ్బారావును బదిలీ చేశారు. ఆయనను ఏసీబీలో రిపోర్ట్ చేయాల్సిందిగా డీజీపీ ఆదేశించారు ఈ మేరకు గురువారం రాష్ట్రవ్యాప్తంగా పెద్దసంఖ్యలో డీఎస్పీల బదిలీలు జరిగాయి. వెయిటింగ్‌లో ఉన్న డి.శ్రీనివాస్‌రెడ్డిని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా నియమించారు. ఇక్కడ విధులు నిర్వహించిన డీఎస్పీ సుబ్బారావును ఏసీబీకి బదిలీ చేశారు.

మున్సిపల్ పాఠశాలకు సీజీఎస్టీ కమిషనర్ వితరణ

గుంటూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా సమాజంపై సానుకూల ప్రభావం చూపించడానికి కస్టమ్స్, జీఎస్టీ శాఖ కృషి చేస్తుందని ఆ శాఖ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. గుజ్జనగుండ్లలోని మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలకు కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి గురువారం సందర్శించి, పాఠశాల అభివృద్ధికి సహకారం అందించారు. పాఠశాల భవనానికి పెయింటింగ్‌కు నగదు అందచేశారు. ఐరన్ బీరువా, స్టాఫ్ టేబుల్స్, 20 కుర్చీలను బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛభారత్ అభియాన్ నిధుల ద్వారా కస్టమ్స్, జీఎస్టీ కమిషనరేట్లు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అండగా నిలుస్తుందన్నారు. తొలుత కమిషనర్ విద్యార్థులతో వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బీ నరసింహారావు ఉపాధ్యాయులు, జీఎస్టీ అధికారులు చీదేళ్ళ ఈశ్వరరావు, వరకుమార్, సాదిక్ ఆలీ, పూర్ణసాయి, కాకర్ల శ్రీనివాస్ తదితరులున్నారు.


ప్రసంగిస్తున్న సీజీఎస్‌టీ కమిషనర్ నరసింహారెడ్డి

టీజేపీఎస్ విద్యార్థికి ఉత్తమ ఎన్‌సీసీ క్యాడెట్ పురస్కారం

గుంటూరు విద్య, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక టీజేపీఎస్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ గుంటుపల్లి వేంకటదినేష్‌కు ఉత్తమ ఎన్‌సీసీ పురస్కారం వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్‌కే శాస్త్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు గ్రూపు (గుంటూరు, నెల్లూరు, ప్రకాశం) జిల్లాల పరిధిలో రాతపరీక్ష, కవాతు, ఫైరింగ్, మౌఖిక పరీక్షలో మొదటి స్థానం సంపాదించిన సందర్భంగా గ్రూపు కమాండర్ కల్నల్ ఎస్‌ఎం చంద్రశేఖర్ ఉత్తమ ఎన్‌సీసీ క్యాడెట్ పురస్కారం, రూ.4500 నగదు బహుమతి అందజేశారు. దినేష్‌ను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు పోలిశెట్టి శ్యాంసుందర్, కేవీ బ్రహ్మం, పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ అనితా దేవి, కళాశాల ఎన్‌సీసీ అధికారి మేజర్ పి.కుమార్‌రాజా అభినందించారు.


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్‌కే శాస్త్రి, ఎస్ అనితాదేవి



నల్లపాడు చెరువుపై నిర్లక్ష్యం

- ఒక వైపు ఆక్రమణలు.. మరో వైపు మురుగు నీరు
- గత ఐదేళ్లుగా పూడికతీత లేదు..
- పశువులకు తాగు, సాగునీరు లేక ఇబ్బందులు
- ఆందోళన చెందుతున్న రైతులు, స్థానికులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): దాదాపు 93 ఎకరాల చెరువు.. చుట్టు పక్కల గ్రామాలకు సాగునీరు... పశువులకు తాగునీరు అందించే సుదీర్ఘ చరిత్రగల నల్లపాడు చెరువుకు గ్రహణం పట్టింది. స్థానిక 27 డివిజన్ పరిధిలో ఉన్న చెరువుకి గత పాలకులు, వారికి సహకరించిన అధికారుల నిర్లక్ష్యంతో ఈ దుస్థితి పట్టింది. దీంతో దాదాపు 5 గ్రామాలకు సాగు నీరు, పశువులకు తాగునీరు లేక అల్లాడిపోతున్నారు. దీనిపై గత ప్రభుత్వంలో అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా ఈ చెరువుకు మంచి రోజులు వస్తాయని ఆ ప్రాంత రైతులు, స్థానికులు ఆశిస్తున్నారు.

దాదాపు 70-80 ఎకరాల విస్తీర్ణంగల ఈ చెరువుకు సాగర్ నుంచి వంకాయలపాడు కాలువ ద్వారా నీరు అందుతుంది. మోటార్ల సాయంతో తురకపాలెం, నల్లపాడు, చల్లవారిపాలెం, అంకిరెడ్డిపాలెం, లింగాయపాలెం గ్రామాల పంట పొలాలకు సాగునీరు అందుతుంది. అంతేగాక అయా పశువులకు తాగునీరు, ఇతర అవసరాల కోసం ఈ చెరువు నీటిని వినియోగిస్తున్నారు. గత ప్రభుత్వాలు చెరువులో పూడిక తీసి, గుర్రపు డెక్కను తొలిగించి రైతులకు, స్థానికులకు అండగా నిలబడేవారు.

వైసీపీ హయాంలో ఆక్రమణలు

వైసీపీ అధికారంలోకి రాగానే ఈ చెరువు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. గత ఐదేళ్లలో పూడిక తీయలేందటే పరిస్థితి అర్థం చేసుకోవాలి. దీనికి ఆక్రమణలు తోడయ్యాయి. చెరువు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది. వైసీపీ అండతో చెరువుకు సంబంధించిన 2.70 ఎకరాల్లో రియల్ ఎస్టేట్‌కు కార్పొరేషన్ నుంచి అనుమతి తీసుకుని 5 ఏకరాల్లో శాలిని డెవలపర్ సంస్థ వెంచర్లు వేసి విక్రయిస్తోంది. దీనిపై నగరపాలక సంస్థ అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసినా ఫలితం లేకపోయింది. ప్రవాహం ఎక్కువైనప్పుడు నీరు బయటకు వెళ్లే స్థలాన్ని ఆక్రమించుకోవడంతో ఆ నీరు నల్లపాడు, హౌసింగ్ బోర్డు, ఇతర ప్రాంతాలను చేరుతుంది. దీనికి తోడు నివాస ప్రాంతాల నుంచి మురుగునీరు చేరుకుంటుంది.

అధికారుల అత్యుత్సాహం

నల్లపాడు ప్రధాన రోడ్డు వరకు సిమెంట్ రోడ్డు నిర్మిస్తామని రియల్ ఎస్టేట్ వారు గతంలో గ్రామస్థులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అ తరువాత స్థానిక వైసీపీ నాయకుల సహకారంతో నగరపాలసంస్థ నిధులతో రోడ్డును నిర్మించారు. నగరపాలక సంస్థ అధికారుల అత్యుత్సాహంతో రూ.50లక్షల ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పెమ్మసాని ఆదేశాలు బుట్టదాఖలు

ఈ మధ్యనే ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెరువును పరిశీలించారు. ఆక్రమణలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆక్రమణలకు గురైన స్థలాన్ని చెరువులో కలిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇకపై ఎటువంటి ఆక్రమణలు లేకుండా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు చెప్పారు. రూ.10-12 కోట్లను కేటాయించి చెరువుని ఆధునీకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చిన తరువాత కూడా ఆక్రమణలు యథేచ్ఛంగా కొనసాగుతున్నాయి.

కలెక్టర్‌కు ఫిర్యాదు

దీనిపై గత సోమవారం స్థానికులు, టీడీపీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో చెరువు పక్కన వాకింగ్‌ట్రాక్, ప్రహరీగోడకు రూపొందించిన నివేదికలను బహిర్గతం చేయాలని కోరారు. మట్టిని తవ్వడానికే చెరువును పాడుబెడుతున్నారనే ఆరోపణలపై విచారణ చేపట్టాలని, ప్రస్తుతం పూడికతీత, గుర్రపుడెక్క తొలగించి, మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.


చెరువులోకి భారీగా చెరుకుంటున్న మురుగునీరు

వైసీపీ మాజీ మంత్రి కారుమూరిపై గుంటూరులో కేసు నమోదు

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తాము అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఇళ్లలో నుంచి లాగి కొడతామని, చంపేస్తామన్న వైసీపీ మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావుపై గుంటూరులోని నగరంపాలెం పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. రెండు రోజుల క్రితం ఏలూరులో జరిగిన వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో కారుమూరి నాగేశ్వరరావు సంచలన వ్యాఖ్యలుచేశారు. తాము అధికారంలోకి రాగానే గుంటూరుకు ఇవతల వాళ్ళని ఇళ్లలో నుంచి లాగి కొడతామని, గుంటూరుకు అవతల వారిని చంపేస్తామన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదుమేరకు నగరంపాలెం పోలీస్‌స్టేషన్లో క్రైమ్ నెంబర్ 127/2025 గా బి.ఎన్.ఎస్ 353(1)(బి), 351(2) తదితర సెక్షన్లకింద కేసునమోదు చేశారు.

మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పైనా..

పోలీసుల అదుపులో ఉన్న టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై దాడికి యత్నించడమే గాక అడ్డుకున్న పోలీసులపై దాడిచేసిన వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై నగరంపాలెం పోలీసులు కేసు నమోదుచేశారు. మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు గోరంట్ల మాధవ్‌తో పాటు ఆయన అనుచరులపై కేసు నమోదు చేశారు. మాదవ్‌తో పాటు మరో ఐదుగురు అనుచరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం వారిని కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు.

అభివృద్ధిలో రోల్‌మోడల్‌గా గుంటూరు తూర్పు

ఎమ్మెల్యే నసీర్


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. రూ.3.20 కోట్లతో నిర్మించే నియోజకవర్గంలోని సంగడిగుంట లాంచెస్టర్ రోడ్డులోని కబాడిగూడెం మూడోలైను, వినాయకనగర్‌లో మెయిన్ రోడ్డు, బావాజీనగర్ మూడో లైన్లలోని సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లచెరువు వాకింగ్ ట్రాక్‌పై ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని చెప్పారు. కూటమినేతలు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారని, సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో పేదలకు మంచిపనులు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మేయర్ సజీల, కార్పొరేటర్ వేముల జ్యోతి, సాదినేని శ్రీనివాసరావు, వహీద్, చల్లా ఆంజనేయప్రసాద్, అచ్చికిరణ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు తీరాలంటే ఆర్‌యూబీ తప్పనిసరి

- మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు
- బెటర్ శంకర్ విలాస్ బ్రిడ్జి సాధన జేఏసీ ఆధ్వర్యంలో నగరంలో మానవహారం



మానవహారంలో పాల్గొన్న లక్ష్మణరావు, వ్యాపారులు, పౌరసంఘ నాయకులు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గతంలో ప్రకటించిన విధంగా లాడ్జి సెంటర్ నుంచి హిందూ కాలేజి వరకూ శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మించాలని, ఆర్‌యూబీ కూడా ముందే నిర్మించాలని బెటర్ శంకర్‌విలాస్ బ్రిడ్జి సాధన జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం నగరంలో మానవహారం నిర్వహించారు. లాడ్జిసెంటర్ నుంచి హిందూ కాలేజి వరకూ జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మద్దతు పలికారు. అయన మాట్లాడుతూ బ్రిడ్జికి తాము వ్యతిరేకం కాదని, కేంద్రం నుండి అనుమతుల కోసం కృషి చేసిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కృషి అభినందనీయం అన్నారు. అయితే రూ.98కోట్ల పరిమితి విధించి ఎంతదూరం వస్తే అంత నిర్మించాలని చెప్పటం సరికాదన్నారు. రెండు, మూడేళ్లపాటు సాగే బ్రిడ్జి నిర్మాణ సమయంలో ట్రాఫిక్ సమస్యలు తీరాలంటే ముందుగా అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. జేఏసీ నాయకుడు ఎల్.ఎస్.భారవి మాట్లాడుతూ ఆర్‌యూబీ, ఆర్‌ఓబీ రెండూ నిర్మిస్తామని గతంలో చెప్పి, ఇప్పుడు సాధ్యం కాదని అధికారులు చెప్పటం సరికాదన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రం ఇచ్చే నిధులకు అదనపు నిధులు సమకూర్చి బ్రిడ్జిని నిర్మించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకుడు పీవీ మల్లికార్జునరావు, కె.నళినీకాంత్, పి.హరీష్, అవధానుల హరి, కె.శివరామిరెడ్డి, రాధాకృష్ణ సదాశివరావు, జి.వెంకట్రావు, బెల్లంకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మానవహారంగా ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆర్‌యూబీ వెంటనే నిర్మించాలి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): శంకర్ విలాస్ ఫ్లైఓవర్ నిర్మాణానికి ముందుగానే ఆర్‌యూబీని ప్రభుత్వం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం లాడ్జిసెంటర్ నుంచి హిందూ కాలేజ్ జంక్షన్ వరకు చేయిచేయి కలుపుదాం.. బెటర్ శంకరవిలాస్ బ్రిడ్జిని నిర్మిద్దాం అనే నినాదంతో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ శంకర్‌విలాస్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేస్తే పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, సహాయకార్యదర్శి యశ్వంత్, జిల్లా కమిటీ సభ్యులు శ్రావణ్, భరత్‌చంద్ర, సిటీగర్ల్స్ కన్వీనర్ సౌమ్య, నగర ఉపాధ్యక్షుడు షేక్‌సుభాని, కమిటీసభ్యులు పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌లో పాల్గొన్న జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో నగర కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ల వర్క్‌షాప్ లో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. గురువారం విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో జరిగిన ఈ వర్క్‌షాప్‌నకు ముఖ్య అతిథిగా పురపాలక శాఖ మంత్రి నారాయణ, ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్‌లు హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ పారిశుద్ధ్యం, తాగునీరు, స్ట్రీట్ లైట్లు, రోడ్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అక్టోబర్ 2 నాటికి లెగసీ వేస్ట్ పూర్తిగా తొలగిస్తామన్నారు. వీధి కుక్కలకు స్టెరిలైజేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. గుంటూరు నగరపాలక సంస్థకు ఆస్తి, ఖాళీ స్థల పన్నుల బకాయిలు ఏక మొత్తంగా చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు పొడిగిస్తూ గురువారం జీవో జారీచేసిందని, గుంటూరు నగరంలోని పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.



వేడుకల్లో పాల్గొన్న రావెల సాంబశివరావు, విష్ణువర్ధన్ తదితరులు

ఘనంగా యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకలు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): యూకేజీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గురువారం లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య పాఠశాల యాజమాన్యం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహక బృందం వారిని ఉత్తీర్ణత పత్రాలతో అభినందించి బహుమతులు అందించారు. కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యఅతిథి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే గొప్ప సంస్థలో మీ పిల్లలను చేర్పించారని తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాలకవర్గసభ్యులు గింజుపల్లి వరప్రసాద్ రావు, బొల్లేపల్లి శ్రీనివాసరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో-ఆర్డినేటర్స్ డి.దుర్గాశ్యామ్, పి.శ్రీదేవి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సర్వే దినోత్సవం


ప్రశంసపత్రం అందజేస్తున్న ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ తేజ

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారంలో సర్వే శాఖ ప్రముఖ పాత్ర వహిస్తుందని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఏ భార్గవతేజ అన్నారు. గురువారం స్థానిక గుంటూరు ఆర్డీవో కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వే ఉద్యోగుల యూనియన్ బిల్డింగ్‌లో జాతీయ సర్వే దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా సర్వే ఉద్యోగులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో గ్రామ, మండల సర్వేయర్లతో పాటు ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ్‌తేజ, ఆర్‌డీఓ శ్రీనివాస రావు రక్తదానం చేశారు. మొత్తం 53మంది ఉద్యోగులు అందించిన రక్తాన్ని తలసేమియా బాధితులకు అందిస్తామని సర్వే ఏడీ పవన్‌కుమార్ తెలిపారు. ఇన్‌ఛార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారంలో సర్వేశాఖ ప్రముఖపాత్ర వహిస్తుందని కొనియాడారు. గత ఏడాది బాగా పనిచేసిన సర్వేయర్లకు ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో సర్వే శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన కృపా మహాసభలు


మహాసభలకు హాజరైన విశ్వాసులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నల్లపాడు రోడ్, హౌసింగ్ బోర్డు కాలనీ ఎదుట నాలుగు రోజుల పాటు జరిగే 19వ వార్షిక కృపా మహాసభలు గురువారం ప్రారంభమయ్యాయి. సభలను కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు మాథ్యూస్ ప్రారంభించారు. మహాసభలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో లక్షాలాది మంది విశ్వాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీస్తు గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో హోసన్నా పాస్టర్లు డేవిడ్ రాజు, తిమోతి, క్రైస్తవ సంఘ నాయకుడు యిర్రి రాజశేకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే అంజెండాగా పనిచేయాలి

గుంటూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వాణిజ్యపన్నులశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే అజెండగా పనిచేయాలని ఏపీ వాణిజ్యపన్నులశాఖ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. జిన్నాటవర్ సెంటర్‌లోని వసుంధర భవన్‌లో గురువారం ఆ శాఖ గుంటూరు-1, 2 డివిజన్ నూతన అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా గుంటూరు-1, 2 డివిజన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్ఎస్ఎస్ ప్రసాద్, ఆరిఫ్, సోమశేఖర్, కిరణ్మయిలతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, జిల్లా కార్యదర్శి సుమిత్రా దేవి, వై నాగేశ్వరరావు తదితరులున్నారు.


ప్రమాణస్వీకారం చేయిస్తున్న సూర్యనారాయణ తదితరులు

ముగిసిన కోదండరాముని ఉత్సవాలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కొరిటపాడు గాంధీబొమ్మ సెంటర్ శ్రీ కోదండ రామాలయంలో సీతారామ కల్యాణ మహోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ విచ్చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆయన అన్నదానాన్ని ప్రారంభించారు. సాయంత్రం స్వామివారి పవళింపు సేవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాలను ఆలయ అధ్యక్షుడు కొమ్మినేని శివకోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కె .ఆదినారాయణ, కోశాధికారి కే ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.


మెషిన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ భార్గవ్ తేజ, హరిప్రసాదరావు

వైద్య పరికరాల ప్రారంభం

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఛాతి, సాంక్రమిక వ్యాధుల వైద్యశాలకు పలువురు దాతలు అందజేసిన వైద్య పరికరాలను, ఇతర సౌకర్యాలను గురువారం ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఏ భార్గవ తేజ ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘు ఆధ్వర్యంలో దాతలు పోలిశెట్టి హరిప్రసాదరావు ఇచ్చిన ఆటో ఎనలైజర్ మెషిన్, ఐటీసీ జనరల్ మేనేజర్ పవన్‌కుమార్ అందజేసిన ఎనస్థీషియా మెషిన్‌ను, డాక్టర్ రావెల పద్మావతి అందజేసిన వాటర్‌కూలర్, సిమెంటు బెంచీలతో పాటు ప్రభుత్వం నుంచి అందిన క్రయో బ్రాంకోస్కోపీ వైద్యపరికాలను ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవతేజ, దాత హరిప్రసాదరావు తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విరాళాలు ఇచ్చిన దాతలను అభినందించారు. భవిష్యత్తులో కూడా మరికొందరు దాతలు రోగులకు సహాయపడాలని కోరారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కొన్ని ప్రాంతాల్లో మరమ్మతులకు, ఉచిత భోజనశాలపైన షెడ్డు నిర్మాణానికి అంచనాలు వేసి తనకు అందజేయాలని ఏపీ ఎంఎస్ఐడీసీ డీఈని భార్గవ్‌తేజ ఆదేశించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణయశస్వి, జీఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్, ఐటీసీ సీనియర్ మేనేజర్ గౌరీ నాయుడు, జి రఘు తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న ఎన్ఎంయూ ఉద్యోగులు

ఆర్టీసీలో పాత వైద్యవిధానాన్ని కొనసాగించాలి

- ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఎన్ఎమ్‌యూ ఉద్యోగుల నిరసన

గుంటూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఉద్యోగులకు పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు కోరారు. అసోసియేషన్ పిలుపు మేరకు గురువారం ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో అసోసియేషన్ ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో ముఖ్యంగా ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1/2019ను అమలుచేయాలని విజ్ఞప్తి చేశారు. నాలుగేళ్ళుగా ఆగిపోయిన పదోన్నతులను పునరుద్ధరించాలన్నారు. అలవెన్స్‌లను రూ.150నుంచి రూ.400కు పెంచాలని కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గ్యారేజీలలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ సుబ్బారావు, డిపో కార్యదర్శులు డీవీ శంకరరావు, అమరనాథ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

హ్యాకింగ్ సినిమా పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు నిర్మిస్తున్న హ్యాకింగ్ సినిమా పోస్టర్‌ను గురువారం ఎస్పీ సతీష్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, టెక్నాలజీని ఉపయోగించుకుని మోసం చేసే మోసగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిత్ర దర్శకులు నరేష్ దోనె, మణివరన్ మాట్లాడుతూ హ్యాకర్లు చేస్తున్న సైబర్ నేరాలపట్ల ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలో ఈ సినిమాలో చూపిస్తున్నామని చెప్పారు. ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను ఇప్పటికే కొండవీడులో చిత్రీకరించామన్నారు. హీరోయిన్‌గా ముంబైకు చెందిన కావ్యదేశాయ్ నటిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులను పూర్తిచేసుకుని త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకులకు ముందుకు తెస్తామన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, పాల్గొన్న చిత్ర దర్శకులు మణివరన్, నరేష్

ఉపాధికి ఊతం!





గుంటూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వారిని సంక్షేమ పథకాల తాత్కాలిక బుజ్జగింపులతో సరిపెట్టకుండా, స్వయం ఉపాధి కల్పన దిశగా నడిపించేందుకు కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే దాదాపు ఆరేళ్ల క్రితం ఆగిపోయిన బీసీ ఉపాధి కార్యక్రమాలను ప్రభుత్వం తెరమీదకు తెచ్చింది. ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకు వెళ్లింది

- బడుగు బలహీన వర్గాల స్వయం ఉపాధికి పెద్దపీట
- ఐదేళ్ల తరువాత మళ్లీ కార్పొరేషన్ రుణాల మాట
- 50 శాతం సబ్సిడీతో బీసీలకు భారీగా రుణాలు
- తిరిగి తెరమీదకి ఆదరణ- 3 పథకం పనిముట్ల పంపిణీ
- ఇప్పటికే పెద్ద సంఖ్యలో దరఖాస్తులు

కార్పొరేషన్లలో జోష్..

2014-19కి మధ్య బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ బీసీ కులాలకు చెందిన యువకులు స్వయం ఉపాధి రుణాలు పొందేవారు. 50 శాతం రాయితీతో రూ. 2 లక్షల రుణం తీసుకుని, అందుబాటులో ఉన్న ఏదో ఒక ఉపాధిరంగాన్ని యువత ఎంచుకునేది. అలాంటి కార్పొరేషన్‌ను వైసీపీ ప్రభుత్వం ముక్కచెక్కలు చేసింది. 56 కార్పొరేషన్లుగా విడగొట్టి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కార్పొరేషన్ చైర్మన్లను ఉత్సవ విగ్రహాలుగా నిలబెట్టింది. కూర్చోడానికి కుర్చీలు ఇవ్వలేదన్న విమర్శలు అప్పట్లో బలంగా వినిపించాయి. కాగా కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. బీసీ కార్పొరేషన్లకు హుటా హుటిన చైర్మన్లను నియమించడమే కాకుండా వాటి ద్వారా ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. కార్పొరేషన్ల ద్వారా గరిష్ఠంగా రూ. 8లక్షల వరకూ 50 శాతం సబ్సిడీతో రుణాలు ఇచ్చేందుకు ప్ర భుత్వం చర్యలు తీసుకుంది. తొలివిడతగా ఒక్కో ని యోజకవర్గం నుంచి 15 మందికి ఆ రుణాలు అందిం చనున్నారు. ఇప్పటికే జిల్లాలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమయింది. ఇప్పటి వరకూ గుంటూరు జిల్లా లో 13,435, పల్నాడు జిల్లాలో 9,177, బాపట్ల జిల్లా లో 10,128 మంది కార్పొరేషన్ రుణాలకోసం దర ఖాస్తు చేసుకున్నారు.

జిల్లాలో ఆదరణ-3 పైలట్ ప్రాజెక్టు

ప్రభుత్వం ఆదరణ- 3 పథకాన్ని గుంటూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ప్రారంభించింది. ఆదరణ- పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 135 కులాలకు చెందిన నాలుగు లక్షల మందికి 90 శాతం సబ్సిడీతో రూ. 964 కోట్ల విలువ చేసే పనిముట్లను అందజేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పథకాన్ని ఆపేసింది. అప్పటికే ప్రభుత్వం దగ్గర ఉన్న పనిముట్లను కూడా లబ్ధిదారులకు ఇవ్వకుండా వదిలేయడంతో అవి పాడైపోయాయి. మళ్లీ ఆదరణ- 3 పథకాన్ని ప్రారంభించారు. ఆదరణ- 3 ద్వారా కల్లుగీత కార్మికులు, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, గొర్రెల కాపరులకు, వడ్డెర, భవన నిర్మాణ కార్మికులు, నాయి బ్రాహ్మణులు, రజకులు, చేనేత కార్మికులు, టైలర్స్ పాల వ్యాపారులు, ఎలక్ట్రీషియన్లకు రూ. 10 నుంచి 30వేల విలువ చేసే పనిముట్లు అందజేయనున్నారు. త్వరలో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది.

గౌడ వర్గీయులకు మద్యం దుకాణాలు

కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం పాలసీ మారింది. పాత పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకే మద్యం దుకాణాలు కేటాయించారు. వాటిలో బలహీన వర్గాలకు భాగస్వామ్యం కల్పిస్తూ 10 శాతం షాపులను గౌడ వర్గీయులకు కేటాయించింది. తద్వారా గుంటూరు జిల్లాలో 13, పల్నాడు జిల్లాలో 13, బాపట్ల జిల్లాలో 12 షాపులు వారికి దక్కాయి. చేనేత కార్మికులకు మగ్గం ఉన్న ప్రతి కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో మూడు జిల్లాల్లో 35వేల కుటుంబాలకు మేలు జరుగుతోంది. దీంతోపాటు బీసీలకు పీఎం సూర్యఘర్ సోలార్ ప్లాంటు కోసం రూ. 20వేలు అదనపు సబ్సిడీ ప్రకటించింది.

80వేల మంది మహిళలకు శిక్షణ

స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా బీసీ మహిళలకు కుట్లు, అల్లిక పనుల్లో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించబోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 80వేల మందికి శిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్లు అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గొర్రెలు, పాడిగేదెలు, పశువులకు కూడా రుణాలు అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించి విధివిధానాలపై ఇంకా స్పష్టత రాలేదు.





సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

మే చివరికి పీఎంశ్రీ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

గుంటూరు (విద్య)ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉమ్మడి జిల్లాలో పీఎం శ్రీ పథకం పేరుతో పాఠశాలల్లో చేస్తున్న పనులు మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) లింగేశ్వరరెడ్డి సూచించారు గురువారం కలెక్టరేట్ లోని ఆర్జేడీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు ఉమ్మడి జిల్లాలో ఫేస్ వన్ ,ఫేస్ టు కింద పిఎం శ్రీ పాఠశాలలు మంజూరు అయ్యాయని ఆయా పాఠశాలల్లో చేస్తున్న పనులు సత్వరం పూర్తి చేసేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా కేంద్ర ప్రభుత్వం సూచించిన విధంగా పనులు చేయాలని స్పష్టం చేశారు. గడచిన ఐదు సంవత్సరాలలో చేసిన పనుల గురించి సమీక్షించారు. కార్యక్రమంలో డీఈఓ రేణుక, సమగ్ర శిక్ష ఇంజనీర్లు నాగజ్యోతి, హరి బాబు, పీఎంశ్రీ పథకం సంచాలకులు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



గురుకుల స్కూల్ భవనం

గిరిజన గురుకులం సిద్ధం

- ప్రారంభోత్సవ ఏర్పాట్లలో గిరిజన శాఖ
- పెదతురకపాలెం వద్ద రూ.8.20 కోట్లతో నిర్మాణం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని గిరిజన విద్యార్థులకు గురుకుల విద్య అందుబాటులోకి రానున్నది. ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు గిరిజన సంక్షేమ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. నరసరావుపేట మండలంలోని పెదతురకపాలెంలో గిరిజన గురుకుల పాఠశాల గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరై పనులు చేపట్టారు. అయితే వైసీపీ హయాంలో నిధుల కొరతతో నిర్మాణం నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులు విడుదల చేసింది. దీంతో శరవేగంగా భవనాల నిర్మాణం పూర్తి చేశారు. తరగతి గదులు, బాలుర వసతి గృహాలు, స్టాఫ్ నివాస గృహాల నిర్మాణం పూర్తయింది. ఈ భవనాలను రూ.8.20 కోట్లతో నిర్మించారు. 250 సీట్లను కేటాయించగా త్వరలో అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. గిరిజన బాలుర విద్యాభివృద్ధికి గురుకుల పాఠశాల దోహదపడనున్నది. బాలుర స్కూల్‌ను ప్రారంభించేందుకు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని గిరిజన శాఖ అహ్వానించనున్నది. ప్రారంభోత్సవ తేదీని త్వరలో ఖరారు చేయనున్నట్లు సదరు అధికారులు తెలిపారు.



విద్యార్థుల వసతి గృహాలు

కుంభకోణంపై.. కనికరమా?

(5వ పేజీ తరువాయి)

ఇదే తీరు. జగనన్న కాలనీల పేరుతో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ స్థలం కొనుగోలు నుంచి ఇల్లు కట్టించి ఇచ్చే వరకు అంతటా అక్రమాలే. ఇందులో లబ్ధిదారులకు ఎటువంటి మేలు జరగకపోగా అటు అధికారులు, ఇటు నేతల మధ్య భారీగానే పంపకాలు జరిగాయి. పేదలకు ఇళ్ల స్థలాల కోసమని ప్రభుత్వం భూసేకరణకు ప్రకటన చేయగా రైతులు ఎవరూ ముందుకు రాలేదు. ఈ క్రమంలో పెదరావూరులో టీడీపీ నాయకులతోనే సిఫార్సులు చేయించుకుని కొంత భూమిని కొని మార్కెట్ రేటుకు మించి అదనంగా రెండున్న రెట్లు డబ్బు చెల్లించారు. దీంతో మిగిలిన ప్రాంతాల్లో రైతులు ముందుకొచ్చారు. ఆ తర్వాత వైసీపీ నేతలు రంగంలోకి దిగి భూమాయ చేశారు. ఒక్క తెనాలిలోనే వైసీప దళారులు రంగప్రవేశం చేసి రైతుల వద్ద భూమిని తక్కువకు కొని రెండున్నర రెట్లకు ప్రభుత్వానికి ఇచ్చి భారీగా లబ్ధి పొందారు. పెదరావూరులో ప్రభుత్వం ఇచ్చిన నగదులో వాటాగా ఇవ్వమని నేతలు ఒత్తిడి చేయగా భూములను వెనక్కు తీసుకుంటామని రైతులు హెచ్చరించడంతో వదిలేశారని సమాచారం. మిగిలిన లేఅవుట్లలో అదనంగా డబ్బు వచ్చేలా చేసినందుకు ఎకరాకు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నేతలకు మామూళ్ల కింద వసూలు చేశారు. 2019లో తెనాలి ఐతానగర్‌కు సమీపంలో ఉన్న భూములను ఎకరా రూ.38 లక్షలకు భూములు ఇచ్చేందుకు ప్రభుత్వంతో రైతులు ఒప్పందం చేసుకున్నారు. అయితే ఆ తర్వాత వైసీపీ హయాంలో పట్టణానికి 4 నుంచి 6 కిలో మీటర్ల దూరంలోని భూములకు రూ.92 లక్షలకు పైగా ముట్టచెప్పడం భూ కుంభకోణానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇలా ఒక్క తెనాలిలో రూ.393.51 కోట్లు ఖర్చుపెట్టి 526.36 ఎకరాల భూమిని రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఒక్క తెనాలిలో మాత్రమే రూ.100 కోట్లకు పైగా చేతులు మారితే, రాష్ట్రం మొత్తంలో ఏ మేర భూకుంభకోణం జరిగిందనేది ఊహకే అందని విషయం. ఎకరాకు రూ.10 లక్షలు, రూ.17.5 లక్షల చొప్పున వాటాలిచ్చినందుకు తమకు ఇబ్బందేమీ లేదని, తమకు మార్కెట్ రేటుపై పెద్ద లాభమే జరిగిందని, ఆ విశ్వాసంతో కుంభకోణం జరిగినట్లు చెప్పడానికి రైతులు ముందుకు రావడంలేదని సమాచారం.

అధికారులకూ భారీగానే..

పేదల ఇళ్లకోసం కొన్న భూముల్లో నేతలకు మేళ్లు చేసిపెట్టినందుకు అధికారులకూ భారీగానే ముడుపులు అందినట్లు సమాచారం. ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. గోలీల డొంక లేఅవుట్‌లో ఎకరాకు రూ.2 లక్షల చొప్పున 60 ఎకరాల్లో రూ.12 కోట్లు వసూలు చేసి రెవెన్యూ అధికారులు పంచుకున్నట్లు సమాచారం. మిగిలిన లేఅవుట్లలో వచ్చిన వాటాలు కలిపితే రూ.15 నుంచి రూ.20 కోట్ల వరకు అధికారులకు దక్కి ఉంటుందనేది అంచనా.

ఖాతాలు శోధిస్తే గుట్టురట్టు

రైతుల ఖాతాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన నగదును డ్రా చేసి అదే రోజు కొన్ని ఖాతాల్లో జమ చేసినట్లు తెలిసింది. కేవలం వీటికోసమే కొన్ని కొత్త పరం ఖాతాలు తెరిచారని, మరికొన్ని వ్యాపార సంస్థల కరెంట్ ఖాతాలు కూడా వీటి కోసం వాడుకున్నారు. పిండికొట్ల బజార్‌లోని కెనరాబ్యాంక్, ఐతానగర్‌లోని సిండికేట్ బ్యాంక్, స్టేట్‌బ్యాంక్, కోస్టల్ బ్యాంక్, బుర్రిపాలెం రోడ్డులోని బ్యాంక్ ఆఫ్ ఇండియా, మరికొన్ని బ్యాంక్‌లలో ముందే మాట్లాడుకుని బ్యాంక్ సిబ్బందితో ఒప్పందం చేసుకున్నాకే లావాదేవీలు ఏ ఆటంకం లేకుండా చేసుకున్నారని చెబుతున్నారు. ఈ ఖాతాలు పట్టుకుంటే గుట్టంతా బయటకు వస్తుందని చెబుతున్నారు. అయితే ఆయా బ్యాంక్‌లలో అప్పట్లో ఉన్న మేనేజర్‌లు, ఇతర సిబ్బంది సహకారం పుష్కలంగా ఉండటంవల్లే ఇవన్నీ సాధ్యం అయ్యాయని, వారిని కూడా విచారిస్తే తేలికగా బండారం బయటకు వచ్చే అవకాశం ఉందంటున్నారు.

అధికారుల తీరుపై అనుమానాలు..

తెనాలిలో జరిగిన భూ కుంభకోణంపై తొలి నుంచి ఆలపాటి విచారణకు పట్టుబడుతూ వచ్చారు. అప్పట్లో వైసీపీ సర్కారు పట్టించుకోకపోతే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. భూ కొనుగోళ్లు జరిపిన బుర్రిపాలెం, నేలపాడు, పెదరావూరు, కొలకలూరు, అంగలకుదురు, గుడివాడ, సంగంజాగర్లమూడి గ్రామాల్లోని నాడు భూములు విక్రయించిన రైతులను విజిలెన్స్ అధికారులు నెల నుంచి విచారిస్తున్నారు. ఆ మొత్తాలు బ్యాంక్ ఖాతాల ద్వారా కాకుండా నేరుగా డబ్బే తీసుకోవడంతో, రైతులు చెప్పే ఆధారాలు మినహా రికార్డు పరంగా ఏ ఆధారాలు లేకపోవడంతో వారు తమపైకి ఏదీ రాదనే ధీమాతో ఉన్నట్లు సమాచారం. అయితే అప్పటి వీఆర్‌వోకు ఓ రైతు తన 2 ఎకరాలకు వచ్చిన డబ్బులో రూ.1.5 లక్షలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఆ బ్యాంక్ ఖాతాలు పట్టుకోగలిగితే గుట్టు వీడుతుంది. అయితే విచారణ సాగుతున్న తీరు చూస్తే కుంభకోణం గుట్టురట్టు చేసేలా కాకుండా అక్రమార్కులను కాపాడేలా ఉన్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కూటమి నేతలు ఈ కుంభకోణం వెనుక దాగున్న రహస్యాలను విజిలెన్స్ అధికారుల ముందుంచారని సమాచారం. అయినా విచారణలో వేగవంతం లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



యూపీఎస్‌సీ పాత ప్రశ్నపత్రాలు - సమాధానాలు పుస్తకావిష్కరణ చేస్తున్న మండలి బుద్ధప్రసాద్ తదితరులు

మాతృభాషే సంస్కృతి పరిరక్షణకు మూలాధారం

- అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- కేఎల్‌యూలో తెలుగు భాష అంతర్జాతీయ సదస్సు

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఏ ప్రాంత సంస్కృతి పరిరక్షించబడాలన్నా ఆ ప్రాంత భాష ముందుగా రక్షించబడాలని తెలుగు భాషా సంఘం మాజీ అధ్యక్షుడు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. గురువారం వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూని వర్సి టిలో బీఏ ఐఏఎస్ విభాగం అధిపతి శివనాగయ్య అధ్యక్షతన సదస్సు ఏర్పాటు చేశారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియలు, వాదా లు, సమాలోచన అనే అంశంపై ప్రారంభమైన రెండు రోజుల అంతర్జాతీ య సదస్సుకు బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ హితమే సాహిత్యం పరమావ ధని చెప్పారు. విశిష్ట అతిథిగా హాజరైన రాష్ట్ర రహదారు భద్రతా విభాగం డీఐజీ సీహెచ్ విజయారావు మాట్లాడుతూ మాతృభాషలో సివిల్ సర్వీసెస్ రాసి లక్ష్యాన్ని సాధించడం సులువవుతుందన్నారు. ఈ సందర్భంగా యూని వర్సిటీ ప్రచురించిన 11 సంవత్సరాల యూపీఎస్‌సీ పాత ప్రశ్నపత్రాలు- సమాధానాలు విశ్లేషణలతో కూడిన గ్రంథాన్ని వారు ఆవిష్కరించి విద్యా ర్థులకు అందజేశారు. మొదటి రోజు సదస్సులో ఆంధ్రా తెలంగాణ ప్రాంతా లకు చెందిన ప్రత్యక్షంగా 30 మంది, ఆన్‌లైన్‌లో 30 మంది ఆచార్యులు, పరిశోధనా విద్యార్థులు పరిశోధనా పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల విభాగం అసిస్టెంట్ కమిషనర్ డి.రాంబాబు, ఆంధ్ర లయోల కళాశాల విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ గుమ్మా సాంబశివరావు, రచయిత్రి నయనాల వాణిశ్రీ, వీసీ సారధివర్మ, ప్రోవీసీలుతదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కే మధుమూర్తి

విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోవద్దు

ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య మధుమూర్తి

పెదకాకాని, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోరాదని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కే మధుమూర్తి తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డైక్‌మెన్ హాలులో ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఏఎన్యూ మహోత్సవం -2025 గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. విద్యార్థులు ఎప్పుడు చదువును అశ్రద్ధ చేయకూడదన్నారు. ప్రతి విద్యార్థి అవకాశాలను సృష్టించుకుంటూ, అందిపుచ్చుకుంటూ అభివృద్ధి చెందాలన్నారు. ఉప కులపతి ఆచార్య గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుని నైపుణ్యతను సమాజాభివృద్ధికి వినియోగించాలన్నారు. రెక్టార్ ఆచార్య రత్న శిలామణి మాట్లాడుతూ రెండు రోజులు జరిగే మహోత్సవంలో విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొని తమ విజ్ఞానాన్ని నైపుణ్యతలను ప్రదర్శించాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు వారి విద్యా విషయాలు మీద ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిద్ధయ్య మాట్లాడుతూ విద్యార్థులు గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. అకాడమిక్ విభాగాలలో ఉత్తమ శ్రేణి సాధించిన విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. టెక్నికల్, లిటరల్లీ ఈవెంట్స్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం గోపికృష్ణ, డాక్టర్ బీ చంద్రమౌళి, కన్వీనర్ డాక్టర్ రవి కుమార్, డాక్టర్ సతీష్, డాక్టర్ కే చైతన్య, డాక్టర్ పూర్ణచం ద్రశేఖర్, డాక్టర్ వై సునీత, డాక్టర్ ఉమా మహేశ్వరి, డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ టీవీఎస్ వరలక్ష్మి, డాక్టర్ వి.బాలాజీ, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.






విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఆవుల మందే ఆధారం

వేమూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పూర్వ కాలంలో వేసవి మాసం వస్తే చాలు రబీ పైర్లు పూర్తి కాగానే సాగు భూముల్లో భూమి సారవంతం కోసం ఆవుల మందలను కొన్ని రోజుల పాటు ఉంచేవారు. ఆవులు సాగు భూమిలో వదిలిన మూత్రం, పేడ మగ్గిన తరువాత మట్టిలో కలిసేవి తద్వారా మొక్కకు పోషకాలు అందేవి ప్రకృతి సిద్ధమైన ఆర్గనిక్ ఎరువు ఏ పైరు వేసిన సంపూర్ణంగా అందేది పాస్పరస్, పోటాషియం, నైట్రోజన్ తగినంతగా మొక్కలకు అందడంతో పాటు ఊహించని రీతిలో దిగుబడులు కూడా వచ్చి రైతులు లాభసాటి వ్యవసాయాన్ని చవి చూసేవారు. అలాంటిది రాను రాను సేంద్రీయ ఎరువుల వాడకం పెరగడం వల్ల ఆవులు, గొర్రెలు, మేకల మందను చేలలో తోలే విధానం కూడా తగ్గిపోయింది. అక్కడక్కడ కొద్ది మంది రైతులు మాత్రమే ఆవుల మందను చేలలో కట్టు వేస్తున్న దృశ్యాలు కనబడుతున్నాయి. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం, ప్రకాశం జిల్లా ఎర్రగొండ పాలెం ప్రాంతాలకు చెందిన కేవలం ఆవుల మంద కట్టి దానిపై వచ్చే ఆదాయంతోనే జీవనం గడుపుతున్న కొన్ని కుటుంబాలు ఈ ఏడాది కూడా మండల పరిధి లోని కొన్ని గ్రామాలకు రావడం జరిగింది. వారిని ప్రశ్నిస్తే... పూర్వ కాలంలో ప్రతి రైతు తమ భూమిలో తప్పనిసరిగా ఆవులు, గొర్రెలు మందను తోలేవారని ఆ రోజుల్లో డబ్బు తక్కువ ఇచ్చిన వలస వెళ్లిన తమ కుటుంబాలకు మర్యాదగా భోజన వసతులు కూడా కల్పించేవారని, ఈనాడు మందను కట్టి వేయడమే బాగా తగ్గిపోయిందని దాని వల్ల ఇదే జీవనంగా కొనసాగుతున్న కొన్ని వందల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. వేసవిలో వలసగా వచ్చి జీవనం చేసుకుంటూ మిగతా రోజుల్లో ఆవులను అడవిలోకి తోలడం జరుగుతుందన్నా డు. ప్రస్తుత పరిస్థితులు తమకు దయనీయంగా ఉన్నాయని ప్రభుత్వం ఆవులే జీవనాధారంగా బతికే కుటుంబాలను ఆదుకోవాలని బొల్లాపల్లి మండలం, గంగుపల్లికి చెందిన మంద రైతు పాలం బ్రహ్మం ఆవేదన వ్యక్తపరిచాడు.



వేమూరు వద్ద పొలాల్లో మంద ఆవులు



రైతు బ్రహ్మం

న్యాయం చేయండి

- పురుగుమందు డబ్బాలతో కలెక్టరేట్‌కు గ్రంథసిరి మిర్చి రైతులు

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా అచ్చంపేట మండలానికి చెందిన గ్రంథసిరి మిర్చి రైతులు తమకు జరిగిన అన్యాయంపై చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా అధికారులను ప్రాధేయపడుతున్నారు. ఇప్పటికే అనేకమార్లు మార్కెటింగ్ అధికారులు, పోలీసులు, తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులను ఆశ్రయించిన బాధితులు గురువారం పురుగు మందు డబ్బాలతో కలెక్టరేట్‌కు వచ్చి తమ గోడును వెళ్లబోసుకొన్నారు.

గ్రంథసిరి గ్రామానికి చెందిన రైతులు కోటపాటి రామకోటేశ్వరరావు, పరుచూరి ప్రతాప్, కిలారి నాగేశ్వరరావు, కోటపాటి నాగేశ్వరరావు, కోటపాటి నరసింహారావులు గత ఏడాది మిర్చియార్డులో విజయభాస్కర ట్రేడర్స్‌కు చెందిన గోపు శ్రీనివాసరెడ్డి, సంగిలి కిశోర్‌రెడ్డికి మిర్చిని విక్రయించారు. ఒక్కో రైతుకు రూ. 10 లక్షలకు పైగా వ్యాపారస్థులు బకాయిపడ్డారు. ఇప్పటివరకు వాళ్లకి చిల్లిగవ్వ కూడా చెల్లించకుండా తిప్పుతున్నారు. వాళ్ల వెనక వైసీపీకి చెందిన ఒక నేత ఉన్నారని ఆరోపించారు. తాము మిర్చియార్డు, మార్కెటింగ్ అధికారులను కలిసి ఫిర్యాదు చేశామని, అయితే వాళ్లపై నామమాత్రంగా చర్యలు తీసుకొని వారికే సహకరిస్తున్నారని నిందించారు. అలానే నెల క్రితం తాము కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్‌ని కలిసి ఫిర్యాదు చేశామని, దాంతో వాళ్ల ఆదేశాల మేరకు కేవలం శ్రీనివాసరెడ్డి, కిశోర్ రెడ్డిల లైసెన్సులు మాత్రమే నిలుపుదల చేసి చేతులు దులుపుకొన్నారని చెప్పారు. కలెక్టరేట్‌లో ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ తేజ అందుబాటులో లేకపోవడంతో డీఆర్‌వో షేక్ ఖాజావలికి వినతిపత్రం ఇచ్చి గ్రంథసిరి రైతులు అక్కడి నుంచి నిష్క్రమించారు.



కలెక్టరేట్‌కు వచ్చిన గ్రంథసిరి మిర్చి రైతులు

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో గురువారం జరిగిన వేలంలో 930 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్టధర రూ.10,300, గరిష్టధర రూ.12,425, మోడల్‌ధర రూ.11,400 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్టధర రూ.10,116 గరిష్టధర రూ.12,000, మోడల్‌ధర రూ.12,411 పలికాయి.

పురందేశ్వరికి కూటమి నేతల ఘన స్వాగతం

● పాలడుగులో పల్లెకుపోదాం
● బీజేపీ పోలింగ్‌బూత్ కమిటీలతో సమావేశం

మేడికొండూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పల్లెకు పోదాం చలో కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పాలడుగు గ్రామానికి వెళుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి పేరేచర్ల సెంటర్లో కూటమి నేతలు ఘన స్వాగతం పలికారు ఆమె వెళుతున్న కారుకు అడ్డుగా రావడంతో నిలిపివేశారు. అనంతరం ఆమె కూటమి నేతలతో మాట్లాడారు. స్వర్గీయ ఎన్‌టీ రామారావు కుమార్తెగా ఎంపీ పురందేశ్వరిని పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పాములపాటి శ్రీనివాస్ జనసేన నాయకులు రాచర్ల నాగబాబు, శివప్రసాద్, బీజేపీ నాయకులు కొక్కెర శ్రీనివాస్ చిలక బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాలడుగు గ్రామానికి చేరుకున్న పురందేశ్వరి దేవాలయంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. ఎస్టీ కాలనీలో దేవాలయాన్ని సందర్శించి మహిళలతో మాట్లాడారు. స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ ప్రాంతంలో చీపురు పట్టి ఊడ్చి శుభ్రం చేశారు. తరువాత ఆయుష్మాన్ భారత్ వెల్నెస్ సెంటర్ ఆరోగ్య భారతి కేంద్రంను పరిశీలించి మహిళలకు అందుతున్న వైద్యం గురించి, మందుల గురించి ఆమె విచారించారు. వెల్నెస్ సెంటర్లో పనిచేస్తున్న ఆశా వర్కర్లతో మాట్లాడారు. అనంతరం బీజేపీ పోలింగ్ బూత్ కమిటీలతో సమావేశం నిర్వహించారు.


రామాలయాన్ని శుభ్రం చేస్తున్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు షేక్ బాషా, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి బిట్ర శివన్నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వైవీ సుబ్బారావు, జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి, గుంటూరు జిల్లా ఇన్‌చార్జి తమనంపూడి రామకృష్ణారెడ్డి, ఎడ్లపాటి స్వరూపారాణి, ఆమతి వెంకట రమణ, పాలపాటి రవికుమార్, చరకా కుమార్ గౌడ్, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, పసుపులేటి సాయిరాం, లక్ష్మయ్య, కందుల సైదయ్య, రాచర్ల నాగబాబు, ఆమతి శివపార్వతి, యద్దనపూడి సురేష్, నాగేశ్వర రావు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్తసేకరణపై సిబ్బందికి శిక్షణ

ప్రత్తిపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో చెత్త సేకరణతో పాటు చెత్త నుంచి సంపంద సృష్టించడం, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు నిర్వహణ వంటి పలు విషయాలపై మండలపరిధిలోని తుమ్మలపాలెం గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డులో మేడికొండూరు మండల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులుగా రోజుకో మండలానికి ఈ శిక్షణను అందిస్తున్నారు. క్లాప్ మిత్రలు ప్రతి రోజు చెత్త సేకరించే విధానంతో పాటు ప్రజలకు కల్పించాల్సిన అవగాహన వంటి పలు విషయాలపై ఈ శిక్షణ సాగుతుంది. గ్రామ సర్పంచ్ చల్లా నాగమల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు, మేడికొండూరు ఈవోపీఆర్డీలు రవికుమార్, శంకర్రావు, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

తాగునీటి వృథాపై చర్యలు చేపట్టాలి

● ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేష్

పెదనందిపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తాగునీటి వృథాపై చర్యల చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేష్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆయా సర్పంచులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు అధికమవుతుండడంతో చెరువుల్లో నీళ్లు ఇంకిపోతున్నాయని, గ్రామాల్లో పలుచోట్ల తాగునీరు వృథా అవుతున్నట్లు ఫిర్యాదుల అందాయని, దీనిపై చర్యలు చేపట్టాలని సూచించారు. క్లోరినేషన్ చేసి గ్రామల్లో నీరు విడుదల చేయాలని తెలిపారు. చెరువులను నింపుకునేందుకు త్వరలో కాలువల్లో నీరు విడుదల చేస్తారని, నీరు పెట్టేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీదేవి, ఈవోపీఆర్డీ వర్ధిని, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో 'పల్లెకుపోదాం'


పల్లెకుపోదాంలో పాల్గొన్న బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పార్టీ నిర్వహిస్తున్న పల్లెకు పోదాం కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు ప్రత్తిపాడులో నిర్వహించారు. నియోజకవర్గ బీజేపీ కో కన్వీనర్ డీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు గ్రామంలో పర్యటించారు. పలు కుటుంబాలకు వెళ్లి కూటమి ప్రభుత్వం పనితీరును అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో నిర్వహించిన పల్లెకు పోదాం కార్యక్రమంలో ప్రజల నుండి అనేక సమస్యలు వినిపించాయన్నారు. అందులో ప్రధానంగా గ్రామంలో మంచినీటి సమస్య ఉందని, పబ్లిక్ టాయ్‌లెట్స్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దత్త ప్రసాద్, అప్పారావు, వసంతకుమారి, రమణారెడ్డి, అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలో స్వచ్ఛభారత్


స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న నేతలు, అధికారులు

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ పిలుపు మేరకు తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీల శ్మశాన వాటిక రోడ్డు నుంచి శివాలయం రోడ్డు నాగేంద్ర స్వామి గుడి వరకు రోడ్లను శుభ్రం చేసి కాలువల వద్ద పిచ్చిమొక్కలు తొలగించి ఆ ప్రాంతాలను శుభ్రం చేశారు. నాలుగు ట్రాక్టర్లు, ఒక జేసీబీ, 40 మంది సిబ్బంది, టీడీపీ నాయకులు మున్సిపల్ సిబ్బంది పాల్గొని స్వచ్ఛభారత్‌ను పకడ్బందీగా నిర్వహించారు. స్థానికులకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ డిప్యూటి కమిషనర్ శ్రీకాంత్, డీఈ రాము, ఏఈ అనూష, శానిటేషన్ సెక్రటరీ దుర్గారెడ్డి టీడీపీ సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు, గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, మద్దినేని సుబ్రహ్మణ్యం, సురేష్, నాగూర్‌వలి, కత్తిక శ్రీరాములు, కంచర్ల కోటేశ్వరరావు, సుగుణ, సురేష్, మస్తాన్, దాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష మల్లెల పూజ

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలోని గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 12వ తేదీన ఉదయం కుంకుమ హారతి, పొంగళ్ళ నివేదన, రాత్రికి అమ్మవారి పుట్టింటి వారిచే పసుపు కుంకుమ బళ్ళతో ముగియనున్నది. శుక్రవారం జల బిందెల మహోత్సవం, మల్లెలతో సహస్ర నామావళి పూజలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు దేవస్థాన కమిటీ, గ్రామస్థులు వెల్లడించారు.

గాలులకు నేలకొరిగిన మొక్కజొన్న, జొన్న


గాలులకు నేలకొరిగిన మొక్కజొన్న పంట

దుగ్గిరాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో రెండ్రోజులుగా వీస్తున్న గాలులకు అనేక చోట్ల వందలాది ఎకరాల్లో మొక్క జొన్న, జొన్న పంటలు నేల కొరిగాయి. ఆరుగాలం శ్రమించి, వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి పండించిన పంట నేలకొరగడంతో పూర్తిగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పెద్దగా కురవకపోయినప్పటికీ పడిపోయిన పంటను పైకిలేవనెత్తి కట్టి, కండెలు వలిచేందుకు రెట్టింపు ఖర్చువుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గింజ రాలిపోతే మట్టి, మలినం కలిసి విక్రయించేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోతున్నారు. తేమశాతం, మలినశాతం అంటూ నిబంధనలతో మరింత నష్టపోవాల్సి వస్తుందని, ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు రూ.50 వేల వరకూ ఖర్చుపెట్టామని, కౌలుడబ్బు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోతుందని ఆవేదన చెందుతున్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో కొనుగోళ్లు జరపడం లేదని, పూర్తిగా ఆరబెట్టిన తర్వాతే కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలని అధికారులు చెబుతుండటంతో మరింత ఆందోళన చెందుతున్నారని, తమ పరిస్థితి అగమ్య గోచరంగా ఉందంటున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2225 మద్దతుధరకు, జొన్న క్వింటాల్‌కు రూ.3421లకు కొనుగోలు చేసేందుకు నిర్ణయించిన నేపథ్యంలో, నిబంధనలను సడలించి, త్వరగా కొనుగోలుకు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గర్భిణులకు అందుబాటులో అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం

తాడికొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులకు అందుబాటులోకి అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం తీసుకువచ్చినట్లు జిల్లా వైద్యాధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం తాడికొండలోని గ్రామీణ వైద్యశాలలో నూతన అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సుందరాచారి చొరవతో తాడికొండ ఆర్‌హెచ్‌సీ సెంటర్లో గర్భిణులకు ఉపయోగకరంగా ఉండేందుకు స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల్లోని గర్భిణులు స్కానింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్తూ ఇబ్బంది పడుతున్నారని, వారి ఇబ్బందిని గుర్తించి స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. గైనకాలజీ విభాగం సహకారంతో ఆస్పత్రిలో స్త్రీ వ్యాధుల నిపుణుల సేవలు తిరిగి ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ భార్గవ్ తేజ, ఆర్‌హెచ్‌సీ హెల్త్ ఆఫీసర్ నళిని, కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి సీతారామ, అసిస్టెంట్ ప్రొఫెసర్ రవీంద్ర, గర్భిణులు పాల్గొన్నారు.


అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి విజయలక్ష్మి

పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి

● పని విరామ సమయంలో నిరసన

తుళ్లూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని లేదంటే విజయవాడలో బిక్షాటన కార్యక్రమం చేపడతామని రాజధాని ఏరియా పారిశుధ్య కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం.రవి అన్నారు. గురువారం పని విరామ సమయంలో తుళ్లూరు, వెలగపూడి, అనంతవరం గ్రామాల్లో జీతాలు చెల్లించాలని కార్మికులు నిరసనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కార్మికుల ఆకలి కేకలు ప్రభుత్వానికి అధికారులకు వినిపించటలేదా.. అని ప్రశ్నించారు. ఎన్ని సార్లు సమస్యలు మీద అర్జీలు పెట్టినా స్పందించక పోవటం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. బాధ్యతతో పని చేయాల్సిన అధికారులు విస్మరిస్తున్నారన్నారు ఎన్నాళ్లు కడుపులు కాల్చుకోవాలని ప్రశ్నించారు. తక్షణం పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోతే పోరాటానికి దిగాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్షురాలు చెరుకూరి సుశీల సుఖవేణి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

చేనేతపై జీఎస్టీని పూర్తిగా ఎత్తివేయాలి

● ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చేనేతపై జీఎస్టీని పూర్తిగా ఎత్తివేసి నేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. చేనేత కార్మిక సంం 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కార్పొరేట్ విధానాల కారణంగా చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని, నేత కార్మికులు ఆత్మహత్యలు, ఆకలిచావులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం తర్వాత అతి పెద్ద ఉపాధి రంగమైన చేనేతను పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు జరపాలని, 11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గజవల్లి వెంకట కృష్ణారావు, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు బత్తుల గిరి, దొడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


చేనేత కార్మిక సంఘం జెండాను ఆవిష్కరించిన నేతలు

బాధిత కుటుంబానికి ఉపాధ్యాయుల ఆర్థిక సాయం

కాకుమాను, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండపాటూరు ఎంపీయూపీ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న రాజేష్ అనే ఎస్టీ కాలనీకి చెందిన యువకుడు గత నెల ప్రమాదపు శాత్తు విద్యుదాఘాతానికి గురైయ్యాడు. రాజేష్ గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాజేష్ పరిస్థితి విషమంగా ఉందని తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శీలం అంకారావు, ఎంఈవో-2 విజయభాస్కరరావు దాతల సాయంతో పాటు పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు కొంత విరాళాలు సేకరించి రూ.25 వేల నగదును గుంటూరు జీజీహెచ్‌లో రాజేష్ తల్లికి అందించారు. శుక్రవారం రాజేష్‌కు శస్త్ర చికిత్స నేపథ్యంలో దాతలు ఎవరైన సాయం చేయదలచుకున్న వారు ఎంఈవో లేదా హెచ్ఎం అంకారావు లేదా పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల ద్వారా విరాళాలు అందించాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

లోకేశ్ స్ఫూర్తితో తోపుడు బండ్లు పంపిణీ

● ఇప్పటికి 245 బండ్లు పేదలకు అందజేత


బోరుపాలెంలో చిరువ్యాపారులకు తోపుడు బండ్లను అందజేస్తున్న టీడీపీ నాయకులు

తుళ్లూరు, (బోరుపాలెం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ స్ఫూర్తితో మండలపరిధిలోని బోరుపాలెంలో చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను టీడీపీ నాయకులు గురువారం అందజేశారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ కిరణ్‌కుమార్ ఆర్థిక సహకారంతో వీటిని అందజేశారు. మూడు తోపుడు బండ్లు, ఒక టిఫిన్ బండిని అందజేశారు. మండలంలో ఇప్పటి వరకు 245 తోపుడు బండ్లను కిరణ్‌కుమార్ ఆర్థిక సహకారంతో అందజేశారు. ఇంకా నాలుగు గ్రామాల్లో అందజేయాల్సి ఉందని చెప్పారు. త్వరలో అవి కూడా పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బోరుపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు కట్టా నరసింహారావు, నాయకులు బండ్ల పట్టాభిరామయ్య, జమ్ముల అనిల్, హరికిరణ్(బాబి) పాటి బండ్ల జయకృష్ణ, మూల్పూరి రాంబాబు, కట్టా శ్రీనివాసరావు, నెలకుదిటి నరేంద్ర, చనుమోలు శ్రీనివాసరావు, అనుమోలు మోహనరావు, పాశం పెద సాంబశివరావు, మెండెం మరియదాసు, లాం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

● వైద్యాధికారి కమలాకరరావు

పెదనందిపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బాలింతలు, గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని వైద్యాధికారి కమలాకరరావు అన్నారు. మండల పరిధిలోని వరగాని, పుసులూరులో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పోషక పక్షోత్సవాల్లో భాగంగా బాలింతలకు, గర్భిణులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరగానిలో చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కమలాకరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూరు శాతం లక్ష్యాలను అధిగమించాలి


డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటస్వామి

కాకుమాను, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ ఈకేవైసీ నూరు శాతం లక్ష్యాలను పూర్తి చేయాలని తహసీల్దార్ వెంకట స్వామి రేషన్ డీలర్‌లకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండలపరిధిలోని అన్ని రేషన్ దుకాణ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈకేవేసీ పూర్తి చేయకపోతే లబ్ధిదారులకు రేషన్ ఆగిపోతుందని వివరించారు. రేషన్ డీలర్‌లు నిర్దేశిత సమయంలో వారి పరిధిలోని రేషన్ కార్డు దారులందరికి అవగాహన కల్పించి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది బాజీ, ప్రియదర్శిని, రేషన్ దుకాణ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలో విజిబుల్ పోలీసింగ్

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామంలో విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా సీఐ కళ్యాణరాజు గ్రామంలో ప్రజలను కలిసి పలు అంశాలను వివరించారు. ప్రతి ఒక్కరూ చట్టబద్ధంగా నడుచుకోవాలని యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంటాయని చెప్పారు. సీసీ కెమారా ఏర్పాటు గురించి కూడా స్థానికులకు వివరించారు. కొత్త వారెవరైనా అనుమానాస్పదంగా ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఆపత్కాలంలో జన సేవాదళ్ విశిష్ట సేవలు

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ

మంగళగిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ విపత్తులు, వరదలు, ప్రమాదాలు సంభవించినప్పుడు సీపీఐ అనుబంధ సంఘమైన జన సేవాదళ్ విశిష్ట సేవలు అందిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ అన్నారు. మంగళగిరి మండలం చినకాకాని గ్రామంలో జన సేవాదళ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జన సేవాదళ్ శిక్షణ తరగతులు చినకాకానిలో పది రోజుల పాటు జరుగుతాయన్నారు. నవ యువతను సమీకరించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జన సేవాదళ్ కార్యకలాపాలు కొనసాగిస్తామని చెప్పారు. సీపీఐ పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వందేళ్ల పండుగను ఈ ఏడాది డిసెంబర్ 26వ తేదీన పండుగలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అలాగే, రెడ్ షర్ట్ వలంటీర్లతో పాటు లక్షలాది మంది ప్రజల సమక్షంలో సీపీఐ శత వార్షికోత్సవ వేడుకలు ఖమ్మంలో జరుగుతాయని తెలిపారు. విజయవాడ నగరంలో అంతర్జాతీయ సెమినార్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. దేశంలో హిందూ మత భావాలను మతోన్మాదులు రెచ్చగొట్టి మైనార్టీల్లో అభద్రతా భావం పెంచేలా దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ మతోన్మాదాలు ఫాసిస్ట్ రాజకీయాల ద్వారా మతకల్లోలాన్ని సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి పరిస్థితుల్లో మైనార్టీలు, గిరిజనులు, అణగారిన వర్గాలకు అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జన సేవాదళ్ శిక్షణ తరగతులను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, చిన్ని తిరుపతయ్య, జీ.కోటేశ్వరరావు, దోనెపూడి శంకర్, కోట మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.


జన సేవాదళ్ శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నేడు 1030 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

మంగళగిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మన ఇల్లు-మన లోకేశ్ పేరిట పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరుగనుంది. మంగళగిరి డాన్‌బోస్కో పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన ప్రాంగణంలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ స్వయంగా లబ్ధిదారులకు పట్టాలను అందజేయనున్నారు. ఉదయం రత్నాలచెరువు ప్రాంతానికి చెందిన 600 మందికి, మధ్యాహ్నం మహానాడు ప్రాంతానికి చెందిన 300 మందికి కలిపి మొత్తంగా 1030 మందికి శాశ్వత ఇళ్ల పట్టాలను పంపిణీ చేయనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగనుంది.

చిరువ్యాపారులకు మంత్రి లోకేశ్ చేయూత


చిరువ్యాపారులకు టిఫిన్ బండ్లు అందజేసిన టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గానికి చెందిన పలువురు చిరువ్యాపారులకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చేయూతనందించారు. నవులూరు గ్రామానికి చెందిన అబ్దుల్ జానీ, నల్లమోతుల మాధవి, మంగళగిరి పట్టణానికి చెందిన చింతలపూడి దుర్గ, తాడేపల్లి పట్టణానికి చెందిన షేక్ సాహిల్‌కు స్థానిక టీడీపీ నేతల ద్వారా గురువారం టిఫిన్ బండ్లు అందజేయించారు. వీరంతా తాము అద్దె బండ్లపై వ్యాపారం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, తమకు సొంత బండ్లు సమకూర్చాలని అర్జీల ద్వారా విన్నవించుకున్నారు. మంత్రి లోకేశ్ ఆర్థిక సహకారంతో గురువారం టిఫిన్ బండ్లు అందుకున్న లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమాల్లో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, నవులూరు గ్రామ అధ్యక్షుడు రుద్రు కోటేశ్వరరావు, నేతలు గోవాడ రవి, తోట శ్రీనుబాబు, బిట్రా దుర్గారావు, కొల్లి వెంకట్రావు, బత్తుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మలినేనిలో ఫార్మసీ ప్రాంగణ ఎంపికలు


మలినేని ఫార్మసీలో ప్రాంగణ ఎంపికల్లో పాల్గొన్న విద్యార్థినులు

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని పెరుమాళ్ళు ఫార్మసీ కళాశాలలో గురువారం 5 కేర్ సొల్యూషన్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరగ్గా బీ ఫార్మసీ విద్యార్థినులు 93మంది హాజరైనట్లు కళాశాల ఛైర్మన్ పెరుమాళ్ళు వెల్లడించారు. ప్రతి సంవత్సరం ఫార్మసీ కళాశాలలో అనేక పరిశ్రమల ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు. గురువారం జరిగిన ఎంపికల్లో ఉద్యోగాలు పొందేందుకు 36 మంది అర్హత సాధించినట్టు ప్రిన్సిపాల్ జీ సుధాకరరావు వెల్లడించారు. ఎంపికల్లో 5కేర్ సొల్యూషన్ హ్యూమన్ రిసోర్స్ పర్సన్స్ అశ్విని, ప్రత్యూష, జస్సిక, డైరెక్టర్ శ్రీనివాసరావు, హెచ్‌వోడీ రాజేష్ పాల్గొని విద్యార్థినులను అభినందించారు.

ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నేడు 9వ రీసెర్చ్ డే

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం 9వ రీసెర్చ్‌డే జరుగనుంది. ప్రతి ఆరు మాసాలకు ఒకమారు రీసెర్చ్ డే కార్యక్రమాన్ని వర్సిటీ యాజమాన్యం నిర్వహిస్తుంది. ప్రొఫెసర్లు, విద్యార్థులు పరిశోధనా రంగంలో రాణించేందుకు అనువైన సహకారాన్ని అందించడం, ఉత్తమ పరిశోధకులను ప్రోత్సహించడం రీసెర్చ్ డే ప్రధాన ఉద్దేశం. శుక్రవారం జరుగనున్న రీసెర్చ్ డే కార్యక్రమానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (బెర్హంపూర్) డైరెక్టర్ ఆచార్య అశోక్‌కుమార్ గంగూలీ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా వివిధ పరిశోధనా అంశాలపై చర్చ జరుగుతుంది. ఉత్తమ పరిశోధనా పత్రాలను సమర్పించిన విద్యార్థులు, పీహెచ్ స్కాలర్లకు మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నారు. అలాగే పరిశోధనా రంగంలో రాణిస్తున్న ఐదుగురు ప్రొఫెసర్లకు ఉత్తమ పరిశోధనా పురస్కారాలను అందజేయనున్నారు. ఈ పురస్కారాల కింద ఒక్కొక్కరికి రూ.50 వేల నగదు పారితోషకం అందజేస్తారు. ఉత్తమ ప్రయోగాత్మక పరిశోధన, ఉత్తమ థియోరాటికల్, ఉత్తమ పారిశ్రామిక రంగ పరిశోధన, బెస్ట్ సోషల్ ఇంపాక్ట్ రీసెర్చ్ అవార్డులతోపాటు ఉత్తమ యువ పరిశోధక పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. వర్సిటీ వైస్‌చాన్సలర్ మనోజ్‌కుమార్ అరోరా, ప్రొవైస్ చాన్సలర్ సతీశ్‌కుమార్, రిజిస్ట్రార్ ఆర్ ప్రేమ్‌కుమార్, రీసెర్చ్ డీన్ రంజిత్ రీసెర్చ్ డే వేడుకల్లో పాల్గొంటారని వర్సిటీ వర్గాలు తెలిపాయి.

రక్తదానంతో తలసేమియా బాధితులను కాపాడవచ్చు

● రోటరీ క్లబ్ ఆఫ్‌గుంటూరు సభ్యుడు మూర్తి

మేడికొండూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రక్తదానం ద్వారా తల సేమియా బాధితులను కాపాడవచ్చునని రోటరీ క్లబ్ ఆఫ్‌గుంటూరు సభ్యుడు మూర్తి ప్రకీ తెలిపారు. మేడికొండూరు సమీపంలోని ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో తలసేమియా వ్యాధిపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. రోటరీ క్లబ్ తరఫున తలసేమియాపై విద్యార్థులకు మూర్తి వివరించారు. తలసేమియా వ్యాధి బారిన పడిన వారికి రక్తకణాలను మార్చడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడవచ్చునని, ఆయుషు పొడిగించవచ్చునని చెప్పారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్‌బాబు మాట్లాడుతూ తమ విద్యార్థులు రక్తదానం చేయడంలో ముందుంటారని గత వారం చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 100కు పైగా యూ నిట్ల రక్తాన్ని శ్రీబ్లడ్ బ్యాంక్ వారితో పాటు తలసేమియా రోగులకు అందజేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెయిన్ బో బ్లడ్ బ్యాంక్ నవీన్, కళాశాల ఏవో బండారు సీతారామయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరి, వివిధ శాఖ అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

అంబేద్కర్ ఫ్లెక్సీలు తొలగించారంటూ ఆందోళన

తెనాలి రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది తొలగించారంటూ పలువురు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. మండలంలోని కొవెవరం సెంటర్ వద్ద అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయన అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గురువారం పంచాయతీ సిబ్బంది వాటిని తొలగించడంతో ఏర్పాటుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో అనేక రాజకీయ ఫ్లెక్సీలు ఉన్నప్పటికీ వాటిని తొలగించకుండా భారత రాజ్యాంగనిర్మాత అంబేద్కర్ ఫ్లెక్సీలు తొలగించడంపై ప్రశ్నించారు. పోలీసులు వచ్చి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

రేషన్ బియ్యం పట్టివేత

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. గురువారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక చెంచుపేట డొంక రోడ్డు వద్ద రేషన్ బియ్యాన్ని వాహనంలో తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు నిర్వంచారు. ఓ వాహనంలో 50 కేజీల చొప్పున 14 బస్తాలు ఉన్నట్టు గుర్తించారు. వాహనాన్ని బియ్యం బస్తాలను స్వాధీనపరుచుకొని స్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. అదేవిధంగా సుల్తానాబాదు కుమార్ పంప్స్ కాలనీ వద్ద 50బస్తాల రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు త్రీటౌన్ పోలీసులు చెప్పారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

'ఏంఈవో లక్ష్మీనారాయణపై చర్యలు తీసుకోవాలి'

తెనాలి రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తెనాలి మండలంలో విద్యాశాఖాధికారి (ఏంఈవో-1)గా విధులు నిర్వహిస్తున్న మేకల లక్ష్మీనారాయణపై చర్యలు తీసుకోవాలని తెనాలికి చెందిన ఎస్‌.వీలీమ్ విద్యాశాఖ మంత్రికి, విద్యాశాఖాదికారులకు వినతి పత్రం అందజేశారు. తెనాలిలో విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ తనిఖీల పేరుతో అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రికార్డులు సక్రమంగా ఉన్నా వార్షిక తనిఖీల పేరుతో ముందు రోజు రూ.10వేలు పంపించాలని, ఆయన అడిగినంత ఇవ్వకపోతే దుర్భాషలాడుతూ ఇబ్బందులు గురిచేస్తున్నాడని ఆరోపించారు. మహిళా ఉద్యోగుల పరిస్థితి మరీ దయనీయంగా ఉందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్‌కు, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఎడ్యుకేషన్, ప్రిన్సిపల్ సెక్రటరీ విద్యాశాఖ, విద్యాశాఖ మంత్రికి అందించినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రుణాల కోసం ఎస్‌బీఐ పోర్టల్

● రీజనల్ మేనేజర్ జగదీష్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రుణాలను త్వరితగతిన పొందేందుకు ఎస్‌బీఐ పోర్టల్ వినియోగించుకోవాలని రీజనల్ మేనేజర్ వి.జగదీష్‌కుమార్ పేర్కొన్నారు. చెంచుపేట స్వర్ణఇన్‌లో గురువారం జీఎస్‌టీ ప్రాక్టీషనర్ల సమావేశం నిర్వహించారు. బ్యాంకు నూతనంగా ప్రారంభించిన బిజెనెస్ రూల్ విధి విధానాలను వివరించారు. ఖాతాదారులు, వ్యాపారులు ఈ పోర్టల్ వివరాలు నమోదుచేసిన వెంటనే రూ.10లక్షల నుంచి రూ.5కోట్ల వరకు రుణాలు పొందవచ్చన్నారు. జీఎస్‌టీ దాఖలు చేసే ప్రతి వ్యాపారికి ఈ నూతన విధానాన్ని వివరించాలని ఆడిటర్‌లను కోరారు. చీఫ్ మేనేజర్ భరద్వాజ్, ఆడిటర్లు గోపాలకృష్ణ, సూర్యనారాయణ, రవిశంకర్, నరేంద్ర, మేనేజర్ ఆలీ, శ్రీనివాసరావు, ప్రవీణ్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఆటో బోల్తా... ప్రయాణికులకు గాయాలు

తెనాలి క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కూలీలతో వెళుతున్న ఆటో బోల్తాపడి అందులో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలైన సంఘటన స్థానిక వైకుంఠపురం వద్ద గురువారం ఉదయం జరిగింది. కూలి పనుల నిమిత్తం అమృతలూరు మండలం మూల్పూరుకు చెందిన 9మంది కూలీలు ఆటో మాట్లాడుకుని కొలకలూరుకు ఉదయాన్నే ప్రయాణమయ్యారు. ఆటో వైకుంఠపురం సమీపంలో అడ్డువచ్చిన కుక్కను తప్పించబోయి ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వీరిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్య సేవలందించారు. ఇందులో ఒకరి పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో వైద్యుల సూచనమేరకు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మధ్యాహ్న భోజనంపై శ్రద్ధ తీసుకోవాలి: ఎంఈవో

కొల్లిపర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని తూములూరు, హనుమాన్ పాలెం, దావులూరు ప్రాథమిక పాఠశాలను ఎంఈవో ఆకస్మికగా తనిఖీచేశారు. విద్యార్థుల హాజరు పట్టీని, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూను అందించాలన్నారు. లేకుంటే తగినచర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

గుంటూరు సినడ్ అధ్యక్షుడిగా ఆశీర్వాదం

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు సినడ్ అధ్యక్షుడిగా కనపర్తి ఆశీర్వాదం గురువారం ఎన్నికయ్యారు. మండల పరిధిలోని గోళ్లమూడిపాడులోని పరిశుద్ధ పేతురు లూథరిన్ దేవాలయంలో ఎన్నిక నిర్వహించారు. 2035 మంది ప్రతినిధులు ఉన్న తూర్పు సినడ్‌లో 135మంది ప్రతినిధులు పాల్గొని ఆశీర్వాదంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సినడ్ ఛైర్మన్ గురవిందపల్లి సురేష్‌బాబు, సీనియర్ కౌన్సిల్ మెంబర్ పొందుగల జయరాజు, జెట్టి శ్యామ్‌సుందర్, బేతాళ భూషణం, చిత్త ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

రజక చెరువుపై కొరవడిన పర్యవేక్షణ



చోరీకి గురైన చెరువు ఫెన్సింగ్

● చోరీకి గురవుతున్న ఫెన్సింగ్
● ఆక్రమణలతో వ్యాపారాలు
● వాకింగ్ ట్రాక్ ఏర్పాటుచేస్తే ప్రజలకు మేలు
● అభివృద్ధి చేస్తే అదనపు ఆదాయం

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున ఉన్న రజక చెరువు ఆలనాపాలనను పురపాలక సంఘం పట్టించుకోకపోవడంతో చెరువు చుట్టూ ఏర్పాటుచేసిన ఫెన్సింగ్ చోరీకి గురై చెరువు సైతం ఆక్రమణల పాలవుతోంది. చెరువుకు నాలుగుపక్కలా రోడ్డు ఉండటంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. గతంలో పురపాలక సంఘం చెరువును అభివృద్ధి చేసి ఆప్రాంత ప్రజలకు చక్కటి ఆహ్లాదం ఆనందం పంచేలా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుచేసి పచ్చదనం ఉట్టిపడేలా వివిధ రకాల పూల మొక్కలను ఏర్పాటు చేసింది. కాలక్రమేణా చెరువు నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహించటంతో ఆక్రమణదారులకు అడ్డాగా మారింది. చెరువుకు వేసిన ఫెన్సింగ్ కొంతమేర చోరీకి గురికాగా మరికొంత కూలిపోయింది. ఇదే అదనుగా కొంతమంది చిరువ్యాపారులు తోపుడు బండ్లు వంటివి ఏర్పాటుచేసి ఆక్రమణలకు తెరలేపగా మరి కొంత మంది ఇంటా బయట వచ్చిన వ్యర్థాలను ఆ చెరువులోనే వేస్తూ దానిని పూడ్చి ఆక్రమించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. పట్టణ నడిబొడ్డున ఉండటంతో ఆ స్థలం రూ.కోట్ల విలువ చేసేది కావడంతో కొందరు రాజకీయ నాయకులు చేజిక్కుంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మునిసిపల్ అధికారులు చెరువు దుస్థితిని పరిశీలించి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ఆక్రమణలను తొలగించి ఆహ్లాదకర వాతావరణంలో ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అభివృద్ధి పనులను చేపట్టాలని పట్టణ ప్రజలు అధికారులను కోరుతున్నారు.



వ్యర్థాలు పోయడంతో కూలిన ఫెన్సింగ్



రీ సర్వేపై గ్రామాధికారులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

రీ సర్వేతో భూ వివాదాలకు స్వస్తి: తహసీల్దార్

తెనాలిరూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వందేళ్లనాటి రికార్డుల ఆధారంగా ఉన్న భూములకు రీ సర్వే ప్రక్రియ చేపట్టడం ద్వారా పారదర్శకమైన రికార్డులు ఏర్పాటు చేయడంతోపాటు భూ హద్దుల వివాదాలు పూర్తిగా పరిష్కారం జరుగుతాయని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని పెదరావూరులో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను తహసీల్దార్ గోపాలకృష్ణ పరిశీలించారు. రీ సర్వే పారదర్శకంగా జరిగేలా అధికారులు బాధ్యతగా మెలగాలని సూచించారు. జొన్న, మొక్క జొన్నపైర్లు కోతదశకు చేరాయని అవి పూర్తయిన వెంటనే సర్వే మరింత వేగవంతం చేయనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ వ్యవస్థాపకులకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

బీజేపీ బలోపేతానికి చర్యలు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకుడు సీహెచ్ విజయభాస్కరరెడ్డి తెలిపారు. పొన్నూరు పట్టణంలోని జేఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం బీజేపీ క్రియాశీలక కార్యకర్తల నియోజకవర్గ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ వార్డు స్థాయి, గ్రామ స్థాయిల్లో బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. వికసిత్ భారత్ ద్వారా11 ఏళ్లలో ప్రధాని మోదీ సారథ్యంలో దేశ ప్రగతికి తీసుకున్న నిర్ణయాలను వివరించారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఈదర శ్రీనివాసరెడ్డి, తాడువాయి రామకృష్ణ, గోవాడ వెంకట కృష్ణారావు, కలపాల శ్రీనివాస్, విజయలక్ష్మీ, చలపతిరావు, సోమేశ్వరరావు, శ్రీనివాసన్, ఆరే వెంకట రావు, పరాశరం రంగవల్లి, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు

కొల్లిపర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ముద్దాయికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షపడింది. ఈ మేరకు తెనాలి స్పెషల్ సెషన్స్ జడ్జి గురువారం తీర్పు చెప్పారు. కొల్లిపర మండలం దావులూరు గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారయత్నం కేసులో 20సంవత్సరాలు జైలు శిక్ష, 10వేలు జరిమానా విధిస్తూ తెనాలి పోక్సో కోర్టు న్యాయాధికారి ఎం.ఇందిరా ప్రియదర్శిని గురువారం తీర్పు వెలువరించారు. 2021సంవత్సరంలో కొల్లిపర పోలీసుస్టేషన్ పరిధిలోని దావులూరుకు చెందిన పాముల సురేష్ (53) ఇంటి సమీపంలో నివసించే కుటుంబానికి చెందిన నాలుగు సంవత్సరాల బాలికపై అత్యాచారయత్నం చేశాడు. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ బలరామిరెడ్డి కేసు నమోదు చేయగా మహిళా ఎస్‌ఐ సంధ్యారాణి కేసు విచారణ చేశారు. నేరం రుజువు కావడంతో గురువారం తెనాలి పోక్సో కోర్టులో నిందితుడు పాముల సురేష్‌కు 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ 10వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోట రమేష్ వాదనలు వినిపించారు.

14వ వార్డు మెంబరు రాజీనామా

● సమస్యలను పరిష్కరించలేకపోతున్నామంటూ ఆవేదన

తెనాలి రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కొలకలూరు పంచాయతీ 14వ వార్డు మెంబరు తిరుమలశెట్టి హేమలత రాజీనామా చేశారు. గురువారం తెనాలి ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన ఆమె పంచాయతీలో వార్డు మెంబర్లు తెలిపిన సమస్యలను పరిష్కరించనప్పుడు తాను చేపట్టిన పదవి అలంకారప్రాయమేనంటూ ఎంపీడీవో అత్తోట దీప్తికి రాజీనామా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో ఓట్లువేసి వార్డు మెంబరుగా గెలిపిస్తే అక్కడ ఉన్న సమస్యల పరిష్కారానికి పంచాయతీకి తెలిపినా పరిష్కారానికి నోచుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో జనసేన తరుపున వార్డు మెంబరుగా ప్రజలకు మేలు చేస్తానని చెప్పి గెలుపొందానన్నారు. వార్డు మెంబరుగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఒక్క అభివృద్ధి పనికూడా చేపట్టలేకపోయానని తెలిపారు. గ్రామ సభల్లో అనేక మార్లు వార్డుల్లో సమస్యలను తెలిపినా, లిఖితపూర్వకంగా వినతి పత్రాలు అందించినా ఒక్కదానిపై కూడా స్పందనలేదని ఆరోపించారు. తమ వార్డులో స్కూల్‌కు అతి సమీపంలో రోడ్లపైనే మద్యంతాగుతున్నా యంత్రాంగం నుంచి స్పందన లేదన్నారు. ఫిర్యాదులు చేసినందుకు తనపై మందు బాబులను ఉసికొల్పుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కొలకలూరు పంచాయతీపై ప్రత్యేక దృష్టిపెట్టకపోతే ప్రజల్లో పాలనపై పూర్తిగా విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆమె స్పష్టం చేశారు.

బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర సభ్యురాలుగా శశికళ



కోన శశికళ

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా పొన్నూరు పట్టణానికి చెందిన కోన శశికళ గురువారం నియమితులయ్యారు రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ నియామక పత్రాలను శశికళకు అందించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘాల నాయకులు శశికళను ప్రత్యేకంగా అభినందించారు.

పొన్న వాహనం పై ఊరేగిన చెన్నకేశవస్వామి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ములుకుదురులోని చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా పొన్న వాహనోత్సవం భక్తి శ్రద్ధలతో జరిగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీభూలీల సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన పొన్న వృక్ష వాహనంపై స్వామి వారిని ప్రతిష్ఠించి గ్రామ వీధులలో గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పొన్న వాహనంపై విహరిస్తున్న చెన్నకేశవస్వామి

ఆగిఉన్న కారును ఢీ కొట్టిన ఆటో

తెనాలి రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కారును వేగంగా వచ్చిన ఆటో వెనుక నుంచి ఢీకొట్టిన ఘటన మండలంలోని సోమసుందరపాలెం వద్ద ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కంఠంరాజు కొండూరుకు చెందిన షేక్ బాజి గురువారం ఉదయం ఆటోలో వంకాయల లోడు వేసుకుని తెనాలి మార్కెట్‌లో దింపారు. తిరిగి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో తెనాలి-మంగళగిరి ప్రధాన రహదారిగా వస్తూ సోమసుందరపాలెం వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును ఢీకొట్టాడు. ఘటనలో కారు వెనుక భాగం దెబ్బతినగా ఆటో డ్రైవర్ బాబికి స్వల్పగాయాలయ్యాయి. కారులో ఉన్న నలుగురికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నీటి కుంటలతో జల సంరక్షణ



మాచవరంలో నిర్మాణంలో ఉన్న నీటికుంట

● ఉపాధి హామీ పథకంతో పంట భూముల్లో నిర్మాణం
● పొన్నూరు నియోజకవర్గంలో చురుగ్గా పనులు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకుని పంట భూములలో జల సంరక్షణ కోసం పంటలకు సాగునీరు అందించడానికి పెద్దఎత్తున నీటి కుంటల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని మండలాల్లో మాగాణి భూములతో పాటు మెట్ట భూములలోనూ నీటికుంటల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. పొన్నూరు మండలంలో వేసవిలో 126 నీటి కుంటలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా 43 నీటి కుంటలు అనుమతులు పొంది రైతులు నిర్మాణాలను ప్రారంభించారు. చేబ్రోలు మండలంలో అత్యధికంగా కూరగాయల తోటలు సాగవుతాయి. కూరగాయల తోటలకు 2, 3 రోజులకు ఒకసారి నీరు అందించాల్సి ఉంది. మెట్ట భూములలో కూరగాయల రైతులు పంటల సాగు చేసేందుకు వీలుగా 115 నీటి కుంటలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే 36 నీటి కుంటలు మంజూరు చేసి నిర్మాణాలు ప్రారంభించారు. పెదకాకాని మండలంలో 66 నీటి కుంటలు లక్ష్యంగా పెట్టుకోగా 57 నీటి కుంటల నిర్మాణానికి అధికారులు అనుమతి ఇచ్చారు.

భూగర్భ జలాల పెంపు

పంటలు పండించాలంటే సాగు నీటికి అత్యంత ప్రాధాన్యం ఉంది. సకాలంలో సాగు నీరు అందకపోతే పంటలు పండక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి. నీటి అవసరాలు అధికంగా ఉండడంతో రైతులు యథేచ్ఛగా భూగర్భ జలాలను మోటార్ల ద్వారా తోడివేయడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఏర్పడింది. వీటిని అధిగమించడానికి పంట భూములలో పెద్దఎత్తున నీటి కుంటలను నిర్మించడం ద్వారా వాన నీటిని వడిసిపట్టడం వల్ల ఓ వైపు పంటలు పండిస్తూనే మరోవైపు భూగర్భ జలాలను పెంచి పర్యావరణ పరిరక్షణకు పాటుపడవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. నీటి ఎద్దడిలోనూ నీటి కుంటలలో ఉన్న నిల్వ వర్షపు నీటితో పంటలను సాగుచేస్తే అన్నదాతలకు సాగునీటి వెతలు తగ్గుతాయని అధికారులు అంచనా. ప్రస్తుతం ఐదు మీటర్ల వెడల్పు, ఐదు మీటర్ల పొడవు రెండు మీటర్ల ఎత్తు నీటి కుంట నిర్మాణానికి రూ.60 వేలు వ్యయం అవుతుందని అంచనా వేయగా 127 పని దినాలు పడతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. 1010 వ్యాసార్థం ఉన్న నీటికుంట నిర్మాణానికి రూ.1.54 లక్షలు ఖర్చు కాగా 364 పని దినాలు కేటాయించారు. 1515 వ్యాసార్థం ఉన్న నీటి కుంటకు రూ.2.14 లక్షలు ఖర్చుతో 491 పనిదినాలు 2020 మీటర్ల వ్యాసార్థపు నీటి కుంటకు రూ.3.80 లక్షలు ఖర్చు కాగా 769 పని దినాలు ఖర్చు అవుతాయని అధికారులు అంచనాలు వేస్తున్నారు. పొన్నూరు మండలంలోనే 17,517 మంది ఉపాధి హామీ పథకం కింద కూలీలుగా నమోదయ్యారు ఈ వేసవిలో నీటి కుంటల నిర్మాణం ద్వారా వారందరికీ పని దినాలు కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు జలసంరక్షణకు పాటుపడాలని అధికారులు కృషిచేస్తున్నారు. అంతేకాకుండా నీటి కుంటల నిర్మాణం పండ్ల మొక్కల పెంపకం, కిచెన్ గార్డెన్ కిట్ల పంపిణీ ద్వారా రైతులకు అదనపు ఆదాయం సమకూర్చే ఏర్పాట్లు చేస్తున్నారు.



ఊరేగింపులో పాల్గొన్న జైనులు

ఘనంగా వర్ధమాన మహావీరుని జయంతి

తెనాలి అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వర్ధమాన మహావీరుని జయంతి గురువారం జైనులు ఘనంగా జరుపుకున్నారు. జైన మతాన్ని ఉద్ధరించిన వారిలో 24వ తీర్థంకరునిగా ఆధ్యాత్మిక, తాత్విక, నైతిక బోధనలను అందించారు. ఆయన విగ్రహాన్ని అలంకరించిన రథంపై ఉంచి పట్టణంలో రథయాత్ర నిర్వహించారు. మార్వాడీ వీధిలోని జైన మందిరం వద్ద ప్రత్యేక పూజలుచేసి దాన ధర్మాలు చేశారు. జైన మత పెద్దలు నేమీచంద్ గోవాణి, రమేష్, అశోక్, శాంతిలాల్, నరేష్, బాబులాలీ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న మహావీర్ జైన్ సంఘ సభ్యులు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని మహావీర్ జైన్ సంఘ సభ్యులు నిర్వహించారు. గురువారం స్థానిక బోసురోడ్డులో మహావీర్ జయంతిని పురస్కరించుకొని మహావీర్ జైన్ సంఘ సభ్యులు పేదలకు ఆహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమేష్ కుమార్ చౌదరి, దినేష్ కుమార్ జైన్, గౌతంకుమార్ జైన్, జైన్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



యోహాను, మల్లేశ్వరరావును సన్మానిస్తున్న శంకరరావు, గోపాలకృష్ణ

పూలే సమాజసేవకు అద్దం పట్టిన సినిమా

● బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకరరావు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జ్యోతిబాపూలే చేసిన సమాజసేవకు సినిమా అద్దం పట్టిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు చెప్పారు. స్థానిక కళాకారులు తీసిన సినిమాను గురువారం బోసురోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో ప్రదర్శించారు. ఇందులో నటించిన కళాకారులు అయినాల మల్లేశ్వరరావు, పెద్దేటి యోహానులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంగస్థల కళలకు ఆదరణ తగ్గిపోవడంతో కళాకారులు చిత్ర నిర్మాణంపై దృష్టి సారించడం అభినందనీయమన్నారు. సమాజంలో నెలకొన్న మూఢాచారాలను తొలగించేందుకు పూలే కృషి చేశారన్నారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు, బెల్లంకొండ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్‌చౌక్‌లో భక్తులకు అన్నదానం చేస్తున్న సంఘ సభ్యులు

హనుమాన్‌చౌక్‌లో ముగిసిన శ్రీరామ నవమి ఉత్సవాలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని హనుమాన్‌చౌక్‌లో ఉగాది నుంచి నిర్వహిస్తున్న శ్రీరామ నవమి ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఆలయం ముంగిట శ్రీసీతారామ అన్నదాన సేవ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద సంఖ్యలో అన్నదానం చేశారు. ఉత్సవాలలో ప్రతిరోజు భక్తులకు ప్రసాదాలు పంపిణీచేస్తూ చివరిరోజు అన్నదానాన్ని ప్రతి ఏటా ఈ సంఘం నిర్వహిస్తోంది. శ్రీసీతారామ మందిరం వద్ద ఉన్న కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు అధికారులు, సిబ్బంది ఈ సంఘాన్ని నిర్వహిస్తున్నారు. ఇందుకు అయ్యే ఖర్చును వారే భరిస్తున్నారు. సీఈవో కృష్ణవేణి, జనరల్ మేనేజర్ ఫణి, మాధవి, జయలక్ష్మి, ఏజీఎంలు బాలాజీ, వాసు తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపరలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న మండల వైద్యాధికారి సుమంత్

వైద్యుల సలహా మేరకు మందులు వాడుకోవాలి

● మండల వైద్యాధికారి సుమంత్

కొల్లిపర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు వైద్యుల సలహా మేరకు మందులను వాడుకోవాలని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపరలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపు ఏర్పాటుచేయడం వలన దీర్ఘకాలిక రోగాలను గుర్తించవచ్చునన్నారు. ప్రతి నెల నిర్వహించే ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్య సేవలందించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలు మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్‌ఎల్‌హెచ్‌పీ రమ్య, ఏఎన్‌ఎం అనిత, హెల్త్‌అసిస్టెంట్ శ్రీనివాసరావు, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.